J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 20 18.10.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## పారాహుషార్



## సుప్రీం కోర్టు - హైకోర్టు - సీబీఐ - ఈడీ - ఇన్‌కంటాక్స్..

# అంతా మాయే!

- సైబర్ ఛీటర్ల వల.. వివిపిలు విలవిల
- రెచ్చిపోతున్న అంతర్జాల మోసగాళ్ళు
- వేలకొద్దీ కాల్స్.. వందలకొద్దీ బాధితులు

జాగ్రత్తగా ఉండండి.. ఏ నిమిషమైనా మీకు వీడియోకాల్ రావొచ్చు. మీ మొబైల్ వీడియోలో స్క్రీన్‌పైన అవతల వైపు మీకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి కనపడవచ్చు. హైకోర్టు జడ్జి మీతో మాట్లాడవచ్చు. దర్జాగా సీట్లో కూర్చుని ఉన్న సీబీఐ అధికారి మీతో ముచ్చటించవచ్చు. పోలీసు యూనిఫారంలో ఉన్న సిఐడి అధికారి మిమ్మల్ని పలకరించవచ్చు. అలా వీళ్ళెవరూ కాకుంటే సాక్షాత్తూ ఇన్‌కంటాక్స్ కమిషనరే మీకు హలో చెప్పవచ్చు. అలా వాళ్ళు ఎవరు మీ లైన్లోకి వచ్చినా కంగారుపడకండి. టెన్షన్‌తో చెమటలు పట్టించుకోకండి. ఎందుకంటే అదంతా మాయ. వాళ్ళందరూ మాయగాళ్ళు. అంతర్జాలాన్ని ఆసరా చేసుకుని మనల్ని దోచుకుంటున్న మోసగాళ్ళు.

10లో



## మూడో కన్ను

# నారా వారి సారా పాట

- కూటమి నేతలతో సిండికేట్లు
- సర్కారే నిర్ణయించిన మద్యం రేట్లు
- 'బతుకు - బతికించు' అంటున్న నేటి నాయకులు
- 'అన్నీ మేమే.. అంతా మాదే' అన్న గత పాలకులు

3లో



జననం : 1946 నిర్యాణం : 2023

## స్మృత్యంజలి

మా కుటుంబ అభివృద్ధికి స్ఫూర్తిప్రదాత
ప్రేమామృతాలను పంచిన అనురాగదేవత

**శ్రీమతి జక్కా సులోచనమ్మ గారు**

పరమపదించి తేది. 21.10.2024 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
**వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...**

భర్త : **జక్కా కోదండరామరెడ్డి (జె.కె.రెడ్డి)**
మాజీ శాసనసభ్యులు, నెల్లూరు.

కుమారులు - కోడళ్ళు
**జక్కా వినూజ రామ్మోహన్**
**జక్కా జనార్ధన్‌రెడ్డి - స్మిత**

కుమార్తె - అల్లుడు
**పద్మజ - ఏ.బి.వి. రమణారెడ్డి**

మనుమళ్ళు, మనుమరాళ్ళు
**జక్కా మనవ్, జక్కా కోదండ శ్రీవత్స**
**రిధి - సిద్ధాంత్**
**ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్**

**ప్రథమ వర్ధంతి**

వారి ప్రథమ వర్ధంతి తేది. 21.10.2024 సోమవారం ఉదయం 11.30 గంటలకు నెల్లూరు, సరస్వతీనగర్‌లోని జక్కా నివాసం 'పద్మాలయ' నందు జరుగును.

# గలగలా గంగమ్మ కదిలివచ్చేను!..

○ రాళ్లపాడు ప్రాజెక్టుకు సాగునీరు
○ హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు మొత్తుకున్నా రాని సాగునీళ్లు, తెలుగుదేశం ప్రభుత్వం చొరవతో పరుగులు తీశాయి. కందుకూరు నియోజకవర్గం లోని లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల నీళ్ళిచ్చి రైతులను ఆదుకోవాలంటూ గతంలో ఎన్నోసార్లు రైతులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తులు చేసుకున్నా వారి మొర ఆలకించేవారు లేకపోయారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ దుస్థితిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నీటి పారుదల మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డిలకు తెలియజేయడంతో వారు వెంటనే స్పందించారు. దీంతో ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ఆదేశాలివ్వడంతో, రాళ్ళపాడు ప్రాజెక్టుకు సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీటిని అధికారులు విడుదల చేశారు. సోమశిల నుంచి సాగునీళ్లు రాళ్లపాడుకు చేరడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఉరకలు వేస్తూ వచ్చిన గంగమ్మతల్లికి ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే ఇంటూరి పూజలు చేశారు. పసుపు కుంకుమలు, పూలు, అమ్మవారికి చీరలు సమర్పించి కొబ్బరికాయ కొట్టి హారతులిచ్చారు. ఇకనుంచి పాడిపంటలతో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా రాళ్లపాడు ప్రాజెక్టు కాలువల మరమ్మతులకు, గేట్ల నిర్వహణకు కూడా ప్రభుత్వం 35 లక్షల రూపాయల నిధులిచ్చిందని, త్వరలోనే కాలువల పూడిక తీయించి, చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కృషిచేస్తామని చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## ఏఎస్‌పేట చెరువుకి..సోమశిల జలాలు

సాగునీళ్లు లేక అవస్థలు పడుతున్న అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట) రైతాంగానికి కూడా సోమశిల జలాలు రావడంతో ఆ ప్రాంత రైతులు సంతోషపడుతున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకుడు పులిమి సుధాకర్‌రెడ్డి, రైతులు ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఏఎస్‌పేట చెరువుకు నీళ్ళివ్వాలని కోరగా, మంత్రి వెంటనే స్పందించి ఆ చెరువుకు సోమశిల జలాలను అందించాలని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు రాజవోలు వద్దనున్న తూము నుంచి ఏఎస్‌పేట చెరువుకు నీటిని విడుదల చేశారు. అందుకు ఏఎస్‌పేట రైతులు మంత్రి ఆనంకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# బాలికల సంరక్షణే ధ్యేయం




జిల్లాలో మహిళల అభ్యున్నతే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, బాలికల సంరక్షణకు కట్టుబడి పనిచేస్తున్నామని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ చెప్పారు. ఇటీవల ఆయన సంతపేటలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భేటీ పడావో, భేటీ బచావో పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి, సీఐ కృష్ణారెడ్డి, ఐటీడీఏ ఏఎల్ఓ శాంతి, బాలికా సంరక్షణాధికారిణి మమత, ఎస్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

# వెంకటేశ్వరపురంలో పూర్వ విద్యార్థుల ఆనందోత్సాహాలు



చిన్నప్పుడెప్పుడో కలిసి చదువుకున్న వాళ్ళంతా, ఎక్కడెక్కడో స్థిరపడి.. మళ్ళీ ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకుంటే వారి సంబరం అంతా ఇంతా కాదు. అంతటి సంబరానికి నెల్లూరు, వెంకటేశ్వరపురంలోని ఓ కన్వెన్షన్ సెంటర్ వేదికైంది. నగరపాలక సంస్థ ఉన్నతపాఠశాల 1996–2001వ బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఈనెల 13న ఆత్మీయ సమావేశం నిర్వహించుకుని, మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత కలుసుకుని తాము చదువుకున్న పాఠశాలనంతా కలియదిరుగుతూ నాటి అనుభూతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనందించారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవించి సన్మానించుకున్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పాటూరు శ్రీనివాసులు, ఏసీనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమవతి, పూర్వ విద్యార్థులు.. ప్రస్తుత మేడికొండూరు ఇన్స్‌పెక్టర్ నాగూరు మీరాసాహెబ్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ షాహిద్, జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, జహీర్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచినీళ్లు అందించకపోతే ఎలా?

- అధికారులపై మండిపడ్డ మంత్రి నారాయణ
- నేరుగా మహమ్మదాపురం పంపింగ్ స్టేషన్ సందర్శన



ప్రజలకు మంచినీళ్ళు అందించకపోతే ఎలా?.. మోటార్లు చెడిపోతే వెంటనే బాగుచేయించాలి కదా?..అధికారులు ఏం చేస్తున్నట్లు'..అంటూ మంత్రి నారాయణ మండిపడ్డారు. నెల్లూరు నగరానికి మంచి నీటిని అందించే మహమ్మదాపురం పంపింగ్ స్టేషన్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో, ఇటీవల రాష్ట్రపురపాలకశాఖ మంత్రి నారాయణ నేరుగా పొదలకూరు మండలంలోని ఆ పంపింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. మోటార్ల మరమ్మతుల గురించి పబ్లిక్ హెల్త్ ఎస్ఇ మోహన్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచే ఆ పంపింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్టు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు పూర్తిచేసి నెల్లూరు నగరానికి వెంటనే మంచినీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన్ను ఆదేశించారు. తాను గతంలో మంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 550 కోట్ల రూపాయల వ్యయంతో నగరానికి శాశ్వత ప్రాతిపదికపై మంచినీళ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, రాబోయే 30 ఏళ్ల తర్వాత కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా మహమ్మదాపురం వద్ద ముందుచూపుతో పంపింగ్ స్టేషన్ ఏర్పాటుచేశామని ఆయన ఈ సందర్భంగా విలేకర్లకు తెలిపారు. రెండురోజుల క్రితం ఈదురుగాలుల దెబ్బకు ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి నగరానికి నీటి సరఫరా నిలిచిపోయిందని, రెండు మోటార్లలో ఒకటి మాత్రం పనిచేస్తోందని చెప్పారు. వీటి నిర్వహణకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో, ఒక్క మోటారుతోనే నీటి పంపింగ్ జరుగుతోందని తెలిపారు. పూర్తిస్థాయిలో వాటి మరమ్మతులకు తాము ఆదేశించామని, అదేవిధంగా నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులకు కూడా త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని వివరించారు.

## భైరవకోనను దర్శించుకున్న సినీనటుడు శ్రీకాంత్



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన.. సీతారామపురం మండలంలోని భైరవకోనను ఇటీవల ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ దర్శించుకుని, అక్కడ కొలువైవున్న త్రిముఖ దుర్గాంబికాదేవి అమ్మవారికి, పరమశివుడికి, భైరవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతించి, పూజలు చేయించి ఆశీర్వదించగా, ఆలయ కమిటీసభ్యులు శాలువలతో సన్మానించారు.

## ఏఆర్ ఏఎస్పీ బదిలీ

జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయన్ను గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలో ఏఆర్ డీఎస్పీగా ఉన్న జి.మునిరాజాను నెల్లూరుజిల్లా ఏఎస్పీగా పదోన్నతినిచ్చి నియమించింది. ఆమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులిచ్చారు.

## జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 229 టవర్లను అందుకు సిద్ధం చేశామని, ఇప్పటికే 145 టవర్ల ద్వారా ఆ సేవలు అందిస్తున్నామని, నవంబరు నెలాఖరు నాటికి మిగిలినవాటిని కూడా ఆరంభిస్తామని బీఎస్ఎన్ఎల్ డెప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో 2.60 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులున్నారని, ఇంకా 4జీ సిమ్ తీసుకోనివారు, వారికి సమీపంలో ఉన్న కస్టమర్ సర్వీస్‌లో కానీ, లేదా సిమ్ కార్డుల విక్రేతల వద్ద కానీ మార్చుకోవచ్చని ఆయన సూచించారు.

# రామలింగేశ్వరుని విగ్రహ ప్రతిష్టకు రండి!



- సోమిరెడ్డికి బద్దెవోలు నాయకుల ఆహ్వానం

మనుబోలు మండలం బద్దెవోలు గ్రామంలోని పురాతన రామలింగేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ఆ ఆలయానికి జీర్ణోద్ధరణ గావించారు ఈనెల 19 నుంచి శ్రీ కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, మీరు తప్పకుండా రావాలంటూ ఇటీవల ఆ గ్రామ ప్రముఖులు..తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య నెల్లూరులోని అల్లీపురంలో ఉన్న మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డితో కలసి ఆలయ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

# గంజాయి అమ్ముతూ.. దొరికిపోయాడు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో గుట్టుచప్పుడుగా గంజాయిని అమ్ముతున్న ఒరిస్సాకి చెందిన ఓ వ్యక్తిని ఇటీవల కోవూరు పోలీసులు పట్టుకున్నారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద మోటార్‌బైక్‌లో గంజాయిని తీసుకువెళ్తున్నాడన్న సమాచారంతో, కోవూరు ఎస్ఐ రంగనాథగౌడ్ అనుమానాస్పదంగా కనిపించిన ఒరిస్సాకి చెందిన హిమాన్షు శేఖర్‌ను పరిశీలించి, బైక్‌లో ఉన్న సుమారు 2 లక్షల రూపాయల విలువచేసే పదిన్నర కిలోల గంజాయిని తహశీల్దార్ నిర్మలానందబాబా సమక్షంలో సీజ్‌చేసి, కేసు నమోదు చేశారు. నిందితుడు జల్సాలకు అలవాటు పడి, గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుచేసి నెల్లూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు తెలుస్తోందని సీఐ సుధాకర్‌రెడ్డి విలేకర్లకు చెప్పారు. గంజాయి విక్రేతను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ రంగనాథగౌడ్‌ను, సునీల్‌కుమార్, రషీద్, సతీష్, రమేష్ తదితర పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

# పల్లె నిండుగా.. ఇక 'ప్రగతి పండుగ!

## ○ 84 లక్షలతో... అభివృద్ధి పనులకు ప్రశాంతిరెడ్డి శ్రీకారం

పల్లెపండుగతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని, పల్లెలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దీంతో ఇక పల్లెలు త్వరలోనే కళకళలాడ నున్నాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 17న మైపాడు గ్రామంలో ఆమె పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. పడమరపాలెం మత్స్యకార కాలనీలో నిర్మిస్తున్న బంగారమ్మ ఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, 10 లక్షల రూపాయల వ్యయంతో మైపాడు గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం, 82 లక్షల రూపాయల వ్యయంతో ఇందుకూరుపేట మండలంలోని వివిధ గ్రామాలలో జరగనున్న అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ, ఆగస్టు 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల ద్వారా తీర్మా నాలు చేసి 13, 326 గ్రామ పంచాయితీల్లో 4,500 కోట్లతో 30వేల అభివృద్ధి పనులు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా గ్రామస్తులే నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీఓ నాగేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఇ ఖాదర్ మస్తాన్, టీడీపీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్రనాయుడు,



సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు కైలాసం ఆదిశేషారెడ్డి, చెంచు కిషోర్ యాదవ్, టీడీపీ రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు పిఎల్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని పడమరపాళెం మత్స్యకార సంఘాలకు చెందిన పెద్దకాపులు శాలువాలు పూల బొకేలతోఘనంగా సన్మానించారు.

# నారా వారి సారా పాట

ఆంధ్రాలో కొత్త మద్యం విధానం అమలులోకి వచ్చేసింది. వేలంపాటలు, లాటరీ పద్ధతులూ, సర్దుబాట్లు, సిండికేట్లూ.. అన్నీ పూర్తి మందుబాబులకు కావలసిన అన్ని బ్రాండ్లూ అక్టోబర్ 16 బుధవారం నుండి అందుబాటులోకి వచ్చాయి. అయిదేళ్ళ తరువాత మళ్ళీ తెరుచుకున్న వైన్‌షాపులన్నీ కళకళలాడుతున్నాయి. ఇప్పుడు మద్యపాన ప్రియులు తమకి కావలసిన బ్రాండ్‌ని దర్జాగా కొనుక్కొని తాగుతున్నారు. జేబులో చిల్లర లేకపోయినా డిజిటల్ పేమెంట్ చేసేస్తున్నారు. గూగుల్-పే, ఫోన్-పే లేదా క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా డబ్బు చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలోని అయిదేళ్లలో డబ్బు రూపంలో చెల్లిస్తే తప్ప.. మందు దొరికేది కాదు. ఇప్పుడా తలనొప్పి లేదు. కూటమి ప్రభుత్వం 2019కి ముందున్న మద్యం పాలసీనే తిరిగి అమలులోకి తెచ్చింది. నారావారి సారా పాట అటు మందుబాబులని, ఇటు మద్యం వ్యాపారులని ఖుషీ చేసేసింది.

### బతుకు - బతికించు... అంటున్న నేటి నాయకులు!

చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వంలో కూటమి నాయకులు బతుకు - బతికించు విధానాన్ని అనుసరిస్తోంది. మాకు కావలసింది మాకివ్వండి, మీకు కావలసింది మీరు తీసుకోండి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ప్రధాన ఆదాయ వనరులున్న మద్యం వ్యాపారంపై స్పష్టత ఇచ్చేసింది. రాష్ట్రం మొత్తంలో 3,396 మద్యం దుకాణాలకి అనుమతి ఇచ్చింది. "నొప్పించక తానొవ్వక... తప్పించుకు తిరుగువాడు ధన్యుడు" అని సుమతి శతకంలో చెప్పినట్లుగా మద్యం విషయంలో ప్రభుత్వ పెద్దలు పక్కకు తప్పుకుని తమ పార్టీ శ్రేణులకు, తమ అనుయాయులకు పగ్గాలు అప్పజెప్పారు. ఈ విధానం 2019కి ముందు కూడా అమలయ్యిందే. అయితే జగన్‌మోహన్‌రెడ్డి మద్యాన్ని ప్రభుత్వ వ్యాపారంగా మార్చి అబాసుపాలయ్యారు.

### అన్నీ మేమే... అంతా మాదే అన్న గత పాలకులు!

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రాలో మద్యం పాలసీని మార్చే సింది. తమిళనాడు తరహా ప్రభుత్వ దుకాణాలని తెరచింది. మద్యం వ్యాపారుల పొట్ట కొట్టింది. ఊరూ పేరూ లేని నాసిరకం బ్రాండ్లని దిగుమతి చేసి మందుబాబుల ఒళ్ళు గుల్లచేసింది. మద్యం వ్యాపారంపై పెత్తనమంతా సజ్జల, సాయిరెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలకి అప్పచెప్పింది. ఆ నలుగురు కలసి బడా కంపెనీలని కట్టడి చేశారు. మద్యం వ్యవహారాన్నంతా 'బాస్' చుట్టూ తిప్పారు. ఆంధ్రాలో కొన్ని డిస్టలరీలని మూయిం చేశారు. ఒక్క మద్యమే కాకుండా మైనింగ్, సిలికా, ఇసుక, క్వార్జ్.. ఇలా అన్నిచోట్లా మేమే, సంపాదనంతా మాదే అన్నట్లుగా దోచేశారు. 'కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్లుగా' మొన్నటి ఎన్నికలలో కేవలం 11సీట్లకి జగన్ పరిమితం కావడానికి మద్యం పాలసీ కూడా ఒక కారణమే. ఇది ఎవరూ కాదనలేని నిజం... అవును ఇదే నిజం. కాబట్టే మొన్నటి ఎన్నికలలో "బాబు గెలవలేదు, జగనే ఓడిపోయాడు"!

# అన్నమయ్య జయంతి కార్యక్రమం వాయిదా!



శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 19 శనివారం నాడు నెల్లూరులో నిర్వహింప తలపెట్టిన "అన్నమయ్య సంకీర్తనా వైభవం" వాయిదాపడింది. జిల్లాలో విస్తృతంగా కురుస్తున్న వర్షాలు, తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిటీ ప్రకటిం చింది. "లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ(బాలగంధర్వం) వ్యవస్థాపకులు రామాచారి కొమాండూరితో పాటు ఆయన శిష్యులైన 25 మంది చిన్నారులతో ఈ కార్యక్రమం జరగవలసి ఉండగా, నిర్వాహకులు దీనిని వాయిదా వేశారు. మళ్ళీ ఎప్పుడు నిర్వహించేదీ.. త్వరలో ప్రకటిస్తామని కమిటీ పేర్కొంది.

# 'వాయుగుండం'.. జిల్లాకు తప్పిన 'గండం'



## ○ మూడు రోజులు..జిల్లాలో కుండపోత వానలు
## ○ నిండిన చెరువులు..పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

***బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల ఏర్పడిన వాయుగుండం జిల్లా ప్రజలను కష్టాల సుడిగుండంలోకి నెట్టింది. మూడురోజుల పాటు కుండపోత వానలతో జిల్లా అంతా అతలాకుతలమైపోయింది. జనజీవనం స్తంభించి పోయింది. వాగులు వంకలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులతో, భారీ వర్షాలతో సముద్ర తీరప్రాంతమంతా తుఫాన్ వాతా వరణంతో భీభత్సంగా మారింది. మూడోరోజైన ఈనెల 16న..బుధవారం ఒక్కరోజునే సగటున జిల్లాలో 83.5 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అంచనా. అత్యధికంగా జలదంకిలో 185 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెన్నానదిలో నీటిమట్టం పెరిగింది. సోమశిల రిజర్వాయర్‌కు వరదనీరు పోటెత్తింది. 20వేల క్యూసెక్కులకు పైగానే సోమశిలకు వరద నీటిప్రవాహం రావడంతో బుధవారానికి డ్యామ్ నీటి నిల్వ 53.054 టీఎంసీలకు చేరింది. ఎట్టకేలకు బుధవారం అర్ధరాత్రి తర్వాత సూళ్ళూరుపేట-పుదుచ్చేరి మధ్య వాయుగుండం తీరం దాటడంతో గురువారం ఉదయం తెరిపిచ్చింది. వరుణుడు పోయి సూర్యుడు కని పించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.***

వాయుగుండం ప్రభావంతో సోమవారం నుంచి బుధవారం వేకువఝాము దాకా కురిసిన భారీవానలతో జిల్లా అల్లకల్లోల మైంది. ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లు నీటి ప్రవాహాల్లో మునిగిపోయాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనేకచోట్ల ఇళ్ళవద్ద మోకాటిలోతు నీళ్ళు కనిపించాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు బాగా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కావలి, విడవలూరు, ముత్తుకూరు, తడ తదితర తీరప్రాంతా ల్లోని అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. గ్రామాల్లో రోడ్లు చిన్నాభిన్నమయ్యాయి. రహదారులు సైతం పలుచోట్ల గుంతలు పడ్డాయి. పంటపొలాలు నీట మునగడంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయి. ప్రాథమికంగా సుమారు 300 హెక్టార్లకు పైగానే పంటపొలాలకు నష్టం జరిగి ఉంటుం దని వ్యవసాయశాఖ వారు అంచనా వేస్తున్నారు. వరి రైతులు, అరటి, నిమ్మ వంటి తోటల రైతులు నష్టపోయారు. వాయుగుండం ప్రభావంతో తుఫాన్ ముప్పు ఉంటుందనే ముందస్తు హెచ్చరిక లతో జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు తీసుకోవడంతో జిల్లా 'వాయుగుండం' నుంచి బయటపడినట్లయింది.

### 14 పునరావాస కేంద్రాలు :

ఇళ్ళలోకి నీళ్ళొచ్చి నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి నెల్లూరు నగరంతో పాటు, ఇతర లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మొత్తంగా సుమారు 900 మందిని ఈ కేంద్రాలకు తరలించి వారికి అన్నపానీయాలు ఏర్పాటుచేశారు. పాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. నెల్లూరు నగరంలోని పునరావాసకేంద్రాల్లో ఉన్నవారికి కమిషనర్ స్వయంగా భోజనాలు పెట్టారు. నగరంలో ప్రధాన కూడళ్ళు వాననీటి ప్రవాహాలతో కాలువలయ్యాయి. పాఠశాల లకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు, పెద్దలు అంతా ఇళ్ళల్లోనే గడిపారు.

### జోరువానలతో జిల్లా జలమయం :

ఈ మూడు రోజులు భారీ వానలు కురవడంతో జిల్లా జలమయమైంది. మూడవ రోజు బుధవారం నాడు వాయుగుండం తీవ్రతతో వానలు మరింత జోరందుకున్నాయి. జలదంకిలో 185 మిల్లీమీటర్లు, కావలిలో 174.4, నెల్లూరు నగరంలో 135.6, నెల్లూరు రూరల్‌లో 123.8, కొండాపురంలో 108.2, తోటపల్లిగూడూరులో 103.4, పొదలకూరులో 103.2, కందుకూరులో 102.8, ఇందుకూరుపేటలో 99.8, వరి కుంటపాడులో 95.6, కోవూరులో 99.2, లింగసముద్రంలో 97.6, సీతారామపురంలో 97.2, వింజమూరులో 92.8, సైదాపురంలో 88.2, ఉదయగిరిలో 87.8, గుడ్లూరులో 85.2, వెంకటాచలంలో 80,8, ముత్తుకూరులో 80.2, కలిగిరిలో 80.2, కలువాయిలో 76.2, వలేటివారిపాళెంలో 77.6, ఉలవపాడులో 72.6, దగదర్తిలో 68.4, దుత్తలూరులో 68.4, బుచ్చిరెడ్డిపాళెంలో 68.2, మనుబోలులో 65.2, విడవలూరులో 65.2, కొడవలూరులో 64.6, రాపూరులో 62.4, అనంతసాగరంలో 58.2, బోగోలులో 51.6, అల్లూరులో 50.2, సంగంలో 47.6, ఆత్మకూరులో 44.6, మర్రిపాడులో 35.4, చేజర్లలో 38.4, అనుమసముద్రంపేటలో 35.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలతో కష్టాలెన్నున్నా.. జిల్లాలోని చెరువులు దొరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. పెంచలకోన, భైరవకోన తదితర కొండకోనల్లో జలపాతాలు కనువిందుగా జాలువారుతున్నాయి.

లాయర్
అక్టోబర్ 18, 2024

# ప్రపంచంలోకెల్లా.. మన ఆహారమే మంచిది!

'ఔను!.. ప్రపంచలోకెల్లా మనం తినే ఆహారమే ఎంతో మంచిది'.. ఇదేదో మనకు మనమే చెప్పుకునే గొప్పలు కాదు. ప్రపంచమంతా ఇప్పుడు 'ఔనంటున్న' నిజం. సహజంగా ఏ దేశంలోని వారికైనా వారు తినే ఆహారం వారికి మంచిదిగానే అన్పిస్తుండడం సహజం. అయితే, ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌లోని ఆహారమే శ్రేయస్కరం అంటున్న మాట నూటికి నూరుపాళ్ళు వాస్తవం. ఇటు ఆరోగ్యపరంగా చూసినా, అటు పర్యావరణం పరంగా పరిశీలించినా భారతీయుల ఆహారమే ఎంతో శ్రేయస్కరమంటున్నాయి నిపుణుల అధ్యయనాలు. తాజాగా వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్) అనే అంతర్జాతీయ సంస్థ అధ్యయనంలో ఆ వివరాలు వెల్లడయ్యాయి. అనేకదేశాల్లో ఆహారసరళిని పరిశీలించిన తర్వాత, భారతీయుల ఆహారం పర్యావరణ హితమని ఆ నివేదిక తేల్చిచెప్పడమే కాక, ఆహారవ్యవస్థల విషయంలో ప్రపంచ దేశాలు భారత్‌ను అనుసరించాలని కూడా సూచించడం విశేషం. అత్యంత వాతావరణ అనుకూలమైన ఆహార వ్యవస్థతో భారత్ జీ-20 దేశాల్లో అగ్రగామిగా కూడా ఉందని, భారత్‌లోని తృణధాన్యాలు (మిల్లెట్స్) మంచి పోషకాహారంగా ఉంటున్నాయని పేర్కొంది. మారుతున్న వాతావరణానికి అవి బాగా సరిపోతాయని, మొత్తంగా భారత్‌లో పండిస్తున్న పంటలు, పంటల సాగు విధానాలు బాగున్నాయని, మానవుల ఆరోగ్యంతో పాటు భూమిపై కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడడంలో భారత ఆహార పద్ధతులు భేషుగ్గా ఉన్నాయంటూ ఆ సంస్థ కితాబునిచ్చింది. కొన్నిదేశాల ఆహార వ్యవస్థలు మొత్తం భూమండలానికే ప్రమాదకరంగా ఉంటున్నాయని, ఈ నేపథ్యంలో భారత్ పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో ప్రధానపాత్ర పోషిస్తోందని కూడా ప్రశంసించింది. అన్నిటికంటే ముఖ్యంగా భారత్ సంప్రదాయసిద్ధమైన ఆహారంలో తృణధాన్యాలు (మిల్లెట్స్) కీలకమైనవని, భారత్ విధానాలను ప్రపంచదేశాలు అనుసరిస్తే ఎంతో బాగుంటుందని కూడా నొక్కిచెప్పింది. ఎంతో ప్రాచీనకాలం నుంచి వస్తున్న సంప్రదాయసిద్ధమైన ఆహారానికి ఇప్పుడు ప్రపంచవ్యాప్త ప్రఖ్యాతి దక్కడం ఎంతైనా హర్షదాయకం. అయితే, ఈ కీర్తి అంతా ప్రాచీనకాలం నాటి మన మహర్షులకు, మన ఆహారాన్ని నిర్దేశించిన మహానుభావులకు దక్కుతుంది. భారత్‌లో వేనవేల సంవత్సరాల క్రితం నుంచీ ఎందరో రుషులు, మహర్షులు మనకు ఆరోగ్యప్రదమైన, సంప్రదాయసిద్ధమైన ఆహారాన్ని నిర్ణయించి, అందుబాటులోకి తెచ్చారు. ఆరోగ్యానికి ఏది మంచో ఏది చెడో..తమ అనుభవాన్నంతా రంగరించి పెద్దలు వాటిని మనకు బోధించారు. వంటింట్లోనే అన్నిరకాల ఔషధ గుణాలున్న పదార్థాలుండే విధంగా అందరికీ అలవాటు చేశారు. మంచి ఆహారంతో మంచి ఆరోగ్యం కనుక, తరతరాలుగా అవే పద్ధతులు నేటికీ ఒక సంప్రదాయంగా మనదాకా వచ్చాయి. అయితే, ప్రపంచమంతా మెచ్చుకుంటున్న మన ఆహారంపై మనకే లోకువగా ఉంటోంది. ఇటీవలికాలంలో విపరీతంగా పెరిగిపోతున్న పాశ్చాత్య విషసంస్కృతితో మన సంప్రదాయాలు, పద్ధతులు అన్నీ దెబ్బతింటున్నాయి. భయంకరమైన కరోనా మహమ్మారిని కూడా తట్టుకునే వ్యాధినిరోధక పదార్థాలు, పోషకాలు కలిగిన మన ఆహారాన్ని వదిలిపెట్టి, అత్యధికశాతం మంది ప్రజలు పిజ్జాలు, బర్గర్లు, జంక్ ఫుడ్‌లు, నాశిరకం వస్తువులు, రసాయనాలు కలిపిన కూల్‌డ్రింక్‌లు, అందమైన ప్యాకింగ్‌లతో వచ్చే కల్తీ చిరుతిండ్లు వగైరాలతో ఆరోగ్యాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. మరోవైపు ఆహారపదార్థాల్లో కల్తీలు ఎక్కువైపోయాయి. దేంట్లో చూసినా కల్తీయే. ఈ కల్తీల కారణంగానే ఏటా కనీసం 10 కోట్ల మంది భారతీయులు నానా రకాల వ్యాధులతో బాధలు పడుతున్నారని మరో అధ్యయనం స్పష్టం చేస్తోంది. అదే విధంగా, పాతకాలంలో వలె పంటల సాగులో ఇప్పుడు రైతులకు సరైన ప్రోత్సాహం ఉండడం లేదు. దీంతో దేశవ్యాప్తంగా అనేక రకాలైన పంటలు క్షీణించిపోతున్నాయి. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతున్న పప్పుధాన్యాలు, మిల్లెట్స్, ఆకుకూరలు, కాయగూరలను మరింత విస్తృతంగా పండించాలంటే రైతులకు ఒక పెద్ద కసరత్తే అవుతోంది.

ప్రపంచమంతా బాగుందని అభినందిస్తున్న మన ఆహారాన్ని.. ఇకనైనా పరి రక్షించుకుంటూ పదికాలాలపాటు పదిలంగా ఉండేలా చూసుకోవాలి. ప్రజలు, రైతులు, ప్రభుత్వాలు సంయుక్తంగా ఆహారవ్యవస్థలను మరింతగా బలోపేతం చేసేందుకు బృహత్తర పథకాలను చేపట్టాలి. ప్రపంచంలో మన ఆహారానికున్న మంచిపేరును శాశ్వతంగా నిలబెట్టుకునేలా, భావితరాలవారికి కూడా మన ఆరోగ్యకరమైన సంప్రదాయ ఆహారమే మార్గదర్శకంగా ఉండేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలి.

# టాటాని సముచిత రీతిన గుర్తించలేకపోయిన భారత సర్కారు!

భారతజాతి గర్వించదగ్గ పారిశ్రామిక దిగ్గజం స్వర్గీయ రతన్ టాటా. ఆయన సృష్టించిన పారిశ్రామిక ప్రపంచం అనితర సాధ్యం. దాతృత్వంలో ఆయన చూపిన సహృదయత అనన్య సామాన్యం. ప్రతి భారతీయుడి దైనందిన జీవితంలో భాగమైన మహోన్నత వ్యక్తి, పారిశ్రామిక శక్తి రతన్ టాటా. టాటా ఉప్పు నుండి ఉక్కు పరిశ్రమల దాకా, టైటాన్ గడియారాల నుండి తనిష్క్ ఆభరణాల దాకా, టాటా కార్ల నుండి విస్తారా విమానాలదాకా, వోల్టాస్ ఎయిర్ కండిషనర్ల దగ్గర నుండి టాటా స్కై దాకా, వస్త్రప్రపంచం నుండి వంటింటి దాకా, ఎలక్ట్రానిక్ పరికరాల నుండి టెలి కమ్యూనికేషన్ల దాకా, ఆతిథ్య రంగం నుండి అంతర్జాతీయ ఐటీ రంగం దాకా తన ఉనికిని చాటుకున్న దార్శనికుడు, దేశ పురోభివృద్ధి కోసం తపించిన స్వాప్నికుడు, కోట్లాదిమందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించిన భారతరత్నం... రతన్ టాటా.

రాజకీయ పదవులను అడ్డంపెట్టుకుని సమాజాన్ని దోచుకుతినే రాజకీయ నాయకులు చనిపోతే ప్రభుత్వాలు సంతాపదినాలని ప్రకటిస్తాయి. అలాంటిది, రతన్ టాటా వంటి మహానుభావుడు మరణిస్తే భారత ప్రభుత్వం కనీసం మూడురోజులైనా సంతాప

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

దినాలుగా ప్రకటించలేకపోవడం దురదృష్టకరం. రతన్ టాటా లాంటి కారణజన్ములని, యుగపురుషులని, సేవాతత్పరులని మన ప్రభుత్వాలు సముచిత రీతిన సంస్మరించుకోలేకపోవడం విచారకరం. ఇప్పటికైనా కేంద్రం కళ్ళు తెరచి రతన్ టాటాకి "భారతరత్న" ప్రకటిస్తే... ఆయన సేవలకు తగిన గుర్తింపు లభించినట్లవుతుంది. ఆయన ఆత్మకి శాంతి కలుగుతుంది!

*యం. చంద్రమౌళి*, **కొత్తఢిల్లీ.**

# దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిలని రాష్ట్రం నుండి తరిమికొట్టాలి!

సభ్య సమాజం సిగ్గుపడేలా వ్యవహరిస్తున్న వైసీపీ మాజీ ఎంఎల్‌సీ దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు ఆయన చెలికత్తె దివ్వెల మాధురిని రాష్ట్రం నుండి వెలెయ్యాలి. భారతీయ వివాహ వ్యవస్థని అపహాస్యం చేసేలా వీళ్ళిద్దరూ ప్రవర్తిస్తున్నారు. ప్రజా నేతలుగా సమాజానికి వీళ్ళిద్దరూ ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. "మా ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి, చట్టపరంగా మేము ఇంకా విడాకులు తీసుకోలేదు, కాబట్టి కలసి సహజీవనం చేస్తున్నాం" అంటూ మాధురి సిగ్గులేకుండా మీడియా ముందు మాట్లాడడం మహిళాజాతికే అవమానం. అతి పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్ళి శ్రీనివాస్, మాధురి వెర్రివేషాలతో ఫోటోషూట్ చేసుకోవడం కూడా క్షమించరాని నేరం. ఇలాంటి వాళ్ళకి సంఘ బహిష్కరణ విధించాలి. ప్రభుత్వం తూ తూ మంత్రంగా కేసులు పెట్టినట్లు కాకుండా వీళ్ళకి కఠినంగా శిక్షపడేలా చర్యలుచేపట్టాలి. వీళ్లపై తీసుకునే చర్యలు చూసి ఇలాంటి నికృష్టపు పనులు చేయడానికి మరొకరు భయపడేలా శిక్షలు ఉండాలి. ఇలాంటి వాళ్లకి పార్టీలలో స్థానం కల్పించి వారిని వెనకేసుకొస్తున్న ఆ పార్టీ అగ్రనేతలకి కూడా ప్రజలే గుణపాఠం చెప్పాలి. మీడియా సైతం తమ టీఆర్పీలు పెంచుకోవడం కోసం అత్యుత్సాహం ప్రదర్శించి ఇలాంటి వార్తలకి ప్రాధాన్యత ఇవ్వడం మానుకోవాలి!

*– డి. హరిత*, **గూడూరు.**




# చేతులు కాలాక.. ఆకులు పట్టుకుంటున్న ప్రభుత్వాలు!

ప్రతి ఏటా వానాకాలం వస్తూనే ఉంటుంది. సర్వసాధారణంగా వానలు కురుస్తూనే ఉంటాయి. అది ప్రకృతి సహజం. కానీ, మన ప్రభుత్వాలే నిర్లక్ష్య ధోరణితో వానలని వరదలుగా మార్చుకుని కాళ్లకిందకి నీళ్ళు తెచ్చుకుంటున్నాయి. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" అన్న సామెత గుర్తుకి వచ్చేలా జరగకూడని నష్టమంతా జరిగిపోయాక, జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక తలలు పట్టుకుంటున్నాయి. అంతా స్వయంకృతాపరాధమే.

పాతకాలంలోనూ వానలు ఇంతకన్నా భారీగానే వచ్చేవి. కానీ, అప్పుడు లేని కష్టాలు ఇప్పుడెందుకు..? అంటే, కారణాలు అనేకం. అప్పట్లో వానలొస్తే పంటలు బాగా పండేవి. వరదలుగా మారినా అవి జనాన్ని ముంచకుండా సముద్రంలో కలిసేవి. ఇప్పుడు, వానలొస్తే ఊళ్ళు మునుగుతున్నాయి. ఇళ్ళు నీళ్ళమయమవుతున్నాయి. నగరాలలో అయితే కార్లు నీళ్లల్లో పడవల్లా తేలుతున్నాయి. మేడలు సైతం అంతస్తుల కొద్దీ మునుగుతున్నాయి.

పిల్ల కాలువల దగ్గర నుండి పంట కాలువల దాకా, చెరువుల నుండి దొరువుల దాకా, నదుల నుండి జలాశయాల దాకా దురాక్రమణలకి గురవుతున్నాయి. అంగుళం నేల కూడా విడిచిపెట్టకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనపడితే అక్కడ అక్రమ కట్టడాలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. విచక్షణ లేకుండా దురాక్రమణదారులు చేస్తున్న అక్రమాలు, అకృత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఫలితంగా వానలొచ్చినప్పుడు నీళ్లు పారే దారే లేక ఊళ్ళు మునుగుతున్నాయి. ఈ దుస్థితికీ, దీన స్థితికీ కారణం ప్రభుత్వాల నిర్లక్ష్యమే. రాజకీయ ప్రయోజనాల కోసం కళ్ళకు గంతలు కట్టుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రాజకీయ నాయకుల స్వార్థమే. నీళ్ళు పారాల్సిన చోట అడ్డంగా బహుళ అంతస్తులు నిర్మిస్తే... ఇక, వాన నీళ్లు పోయేందుకు దారెక్కడ?.. ఆ నీళ్ళన్నీ వరదలా ఉప్పొంగి వూళ్ళకి వూళ్ళని తీవ్రస్థాయిలో ముంచేయడం తప్ప వేరే మార్గమే లేదు. ఆ తీవ్రత ఎంతటి ప్రమాదకరంగా ఉంటుందో మొన్నటికి మొన్న విజయవాడ వరదల్లో కళ్ళారా చూశాం. ఢిల్లీ, కలకత్తా, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల్లో సైతం ఇదే దుస్థితి. వానొస్తుందంటే సంతోషపడాల్సింది పోయి.. జనం భయపడే రోజులొచ్చాయి.

## ఫ్లైఓవర్లపై కార్లు పెట్టిన చెన్నై వాసులు!

నిన్నటికి నిన్న చెన్నై మహానగరంలో వింత పరిణామం చోటుచేసుకుంది. భారీ వర్షాలు కురవబోతున్నాయన్న సమాచారం తెలుసుకున్న చెన్నైలోని వేలచ్చేరీ ప్రాంత జనం అప్రమత్తమయ్యారు. తమ ఇళ్లమీదికి వరదనీళ్ళు వచ్చి తమ కార్లు పడవలుగా మారిన గతానుభవం వాళ్లకి గుర్తొచ్చింది. అప్పుడు జరిగిన నష్టం ఇప్పుడు జరగకూడదని భావించారు. లక్షలుపోసి కొనుక్కున్న తమ కార్లను కాపాడుకోవడానికి నిర్ణయించుకున్నారు. వారిలో ఎవరో ఒక మేధావికి మహత్తరమైన ఆలోచన వచ్చింది. తన కారుని తీసుకెళ్లి తమ ఇంటికి దగ్గరలోవున్న ఫ్లైఓవర్ మీద పార్క్ చేశాడు. తాను చేయడమేకాకుండా ఈ సమాచారాన్ని తమ కాలనీవాసులందరికీ చేరవేశాడు. అంతే, పెద్ద సంఖ్యలో జనం ఆ మేధావి ఆలోచననే అమలుచేశారు. తమ వాహనాలన్నింటినీ ఫ్లైఓవర్‌ల మీద పార్క్ చేశారు. ఈ హఠాత్ పరిణామంతో విస్తుపోయిన పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు సర్కస్ ఫీట్లు చేయవలసి వచ్చింది. అంతే కాదండోయ్ మీ కార్లు మునిగిపోతే మాదేం పోతుందన్నట్లుగా, వంతెనలపై పార్క్ చేసిన కార్లన్నిటికీ ట్రాఫిక్ ఉల్లంఘన చలానా రాసేశారు.

ప్రజల బాధలు చూసి ప్రభుత్వాలు కళ్ళు తెరవకపోగా వారికి ఫైన్ విధించడాన్ని చెన్నైవాసులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. మీ అసమర్థతకి, చేతకానితనానికి మేం నష్టపోయి శిక్ష అనుభవించాలా...? అని ప్రశ్నిస్తున్నారు. బహుశా దేశంలోనే ఇది అరుదైన సంఘటన. కనీసం ఇలాంటి సన్నివేశాలు చూసైనా ప్రభుత్వాలు కళ్ళు తెరుస్తాయా అన్న గ్యారంటీ లేదు. వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు తూ...తూ మంత్రంగా సాయమేదో చేస్తున్నామనిపించుకుంటున్నాయే తప్ప అసలు సమస్యకి పరిష్కారం అన్వేషించడంలో విఫలమవుతున్నాయి.

## లోపమే పాపమై ప్రజలకి శాపమవుతోంది!

భారీవర్షాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి ప్రళయాలవల్ల దేశంలో ఎంతోకాలంగా తరచూ నష్టాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. అంచనాలకి సైతం అందని స్థాయిలో నష్టం వాటిల్లుతోంది. తీవ్రమైన కష్టాలతో జనం అల్లాడుతూనే ఉన్నారు. ప్రభుత్వాల లోపమే పాపమై ప్రజలకి శాపంగా మారుతోంది.

తమ కళ్ళ ముందే కనిపిస్తున్న అక్రమ కట్టడాలని తొలగించకుండా ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. దురాక్రమణలని తొలగిస్తే తప్ప ఈ సమస్యకి పరిష్కారం ఉండదన్న సంగతి తెలిసి కూడా నాయకులు నిమ్మళంగా ఉంటున్నారు. అందుకే, తాజాగా సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికి అక్షింతలేసింది. దేశంలోని నదుల పరీవాహక ప్రాంతాల్లో దురాక్రమణలు, అక్రమ నిర్మాణాల వల్ల నదుల పర్యావరణకు నష్టం కలుగుతోందని, అక్రమ నిర్మాణాల వల్ల తరచూ వరదలు సంభవిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ దురాక్రమణలను తొలగించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారో చెప్పాలని ప్రశ్నించింది. కేంద్రంలోని పర్యావరణ శాఖ, అటవీ, జలశక్తి, భూశాస్త్ర విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, జలసంఘం శాఖలకు సుప్రీంకోర్టు నోటీసులు కూడా జారీచేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇంతటి తీవ్ర స్థాయిలో స్పందించిందంటే, దురాక్రమణల వల్ల ఇటు ప్రజలకు, అటు పర్యావరణానికీ జరిగే నష్టం ఎంత తీవ్రస్థాయిలో ఉంటోందో మనం ఊహించుకోవచ్చు.

## తెలంగాణ తరహాలో ప్రభుత్వాలు మేలుకోవాలి!

తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపింది. "హైడ్రా" పేరుతో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి పర్యావరణ పరిరక్షణకి నడుం బిగించింది. నాళాల నుండి నదుల వరకూ, దొరువుల నుండి చెరువుల వరకూ అన్నింటిపైనా దృష్టి పెట్టింది. ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా భారీ నిర్మాణాలని కూల్చేసింది. ఇలాంటి చట్టం దేశంలోని అన్ని ప్రభుత్వాలూ అమలు చేయాలి. దురాక్రమణ చేయాలంటే భయపడేలా చర్యలు చేపట్టాలి. ఆక్రమణదారులు ఎంతటివారైనా లెక్కచేయకుండా నిర్మాణాలని తొలగించాలి. ప్రతిసారీ ఇలా "చేతులు కాలాక ఆకులు పట్టుకునే" ప్రక్రియకి స్వస్తి పలకాలి. ఇకనైనా దేశం మేలుకోకుంటే ప్రజల భవిష్యత్తు గంగపాలే అన్న నిజం గ్రహించాలి! - రాజశ్రీ



# శ్రీ షిర్డీసాయి ట్రస్టు సేవలు అమూల్యం

నెల్లూరులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం ట్రస్టు సేవలు అమూల్యమని, అవి మరింత కొనసాగాలని నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. నెల్లూరు నగరం నవాబుపేట 9వ డివిజన్‌లోని ఎఫ్‌సీఐ కాలనీ వద్ద ఇటీవల ఎస్ఎస్ కళ్యాణ మండపం (షిర్డీ సాయి కళ్యాణమండపం) ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, ఈ ట్రస్టు ఛైర్మెన్ బాబురావు, గుడిపల్లిపాడు సర్పంచిగా కూడా ప్రజలకు మంచి సేవలు అందించారన్నారు. కళ్యాణ మండపంలో మంచి వసతులు ఉన్నాయని, కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. బాబురావు కరోనా సమయంలో నిరుపేదలకు ఎనలేని సేవలు అందించారని మంత్రి నారాయణ ప్రశంసించారు. ఇప్పుడు కూడా పేదలకు సేవలు అందిస్తున్నారని కొనియాడారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడున్న షిర్డీసాయి ఆలయానికి రెండుసార్లు రావడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలోనే ఈ ప్రాంతంలో పార్కులు కూడా ఏర్పాటు చేశామన్నారు. కళ్యాణమండపం మేనేజింగ్ ట్రస్టీ బాబురావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం, వస్త్రదానం అభినందనీయం - ఎంపీ వేమిరెడ్డి

అన్నదానం, వస్త్రదానం ఎంతో పుణ్యకార్యాలని, గత 45 ఏళ్లుగా ప్రతి ఏటా విజయదశమి సందర్భంగా అన్నదానం, వస్త్రదానం చేస్తున్న శివయ్య, వివేక్ మిత్ర బృందం సేవలు అభినందనీయమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు నగరంలోని 43వ డివిజన్‌లో ఫిష్ మార్కెట్ వద్ద ఇటీవల ఏర్పాటుచేసిన అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలు ప్రారంభించారు. తొలుత అక్కడున్న దేవాలయంలో వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేయడంతోపాటు 300 మందికి అన్నదానం చేశారు. డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ళ నిర్మాణాల్లోనూ..
# అంతులేని అవినీతి
### వైకాపా నేతలపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం



జగనన్న కాలనీల పేరుతో నిర్మించిన పేదల ఇళ్ల నిర్మాణాల్లోనూ అంతులేని అవినీతి జరిగిపోయిందని, ఈ వర్షాల దెబ్బకి ఇళ్లల్లో అడుగుపెట్టడానికే వీలు లేకుండా ఉందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 16న ఆయన వెంకటాచలంలో జగనన్న కాలనీని మోకాటి లోతు నీళ్లల్లో సందర్శించి, అక్కడి పరిస్థితులను చూసి నివ్వెరపోయారు. కాలనీల పేరుతో కోట్లు గడించిన కాకాణి అండ్ బ్యాచ్ ఒక్కసారి ఈ ఇళ్ల మరుగుదొడ్డిలోకి వెళ్లగలరా?.. ఎంత ఘోరంగా ఉన్నాయో ఇవి అంటూ ఏవగించుకున్నారు. పేదల ఇళ్ల పేరుతో కోట్లు మెక్కినవారి నుంచి ప్రతి రూపాయి కక్కిస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత నాసిరకంగా కట్టిన ఇళ్ల దుస్థితిని చూసి ఆయన ఆవేదన చెందారు. 'శ్లాబులో మందం తగ్గిపోయింది... స్టీల్ రాడ్ల ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శించారు. కీలకమైన పునాదుల నిర్మాణంలోనూ అంతా మోసమే'నంటూ దుయ్యబట్టారు. ఈ ఒక్క కాలనీలోనే రూ.20.50 లక్షలతో మట్టి తోలినట్టు బిల్లులు చేసుకున్నారని, ఒక్కో లబ్దిదారుడి వద్ద ఇంటికి రూ.40 వేల వరకు అదనంగా గుంజుకున్నారని, చివరకు మరుగుదొడ్లను కూడా వదిలిపెట్టకుండా అవినీతికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిని ఇప్పటికే తాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లానని, ఆయన ఆదేశాలతో విజిలెన్స్ విచారణ జరుగుతోందని చెప్పారు.



## ఎన్టీఆర్ జిల్లా నేరవిభాగ డీసీపీగా
# తిరుమలేశ్వరరెడ్డి

మొన్నటి ఎన్నికల ముందువరకూ నెల్లూరుజిల్లా ఎస్పీగా కొనసాగిన కే.తిరుమలేశ్వరరెడ్డిని ఎన్టీఆర్ జిల్లా నేరవిభాగ డీసీపీగా ప్రభుత్వం నియమించింది. తాజాగా జరిగిన సాధారణ బదిలీలలో ఆయనకి ఈ పోస్టింగ్ దక్కింది. ఈ సందర్భంగా విజయవాడ సిటీ కమిషనర్ ఎస్.వీ.రాజశేఖరబాబుని తిరుమలేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాజశేఖరబాబు జన్మస్థలం నెల్లూరుజిల్లా కాగా, తిరుమలేశ్వరరెడ్డి ఈ జిల్లా అల్లుడు కావడం విశేషం!

## బెజవాడ కనకదుర్గమ్మకు..
# నెల్లూరు దాత కానుక
### 10 లక్షల విలువైన స్వర్ణహారం సమర్పణ



శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బెజవాడలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి నెల్లూరుకు చెందిన దాత.. ప్రముఖ కాంట్రాక్టర్ పంకజ్‌రెడ్డి-సరిత దంపతులు 10లక్షల రూపాయల విలువచేసే బంగారు హారాన్ని కానుకగా సమర్పించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామారావు ద్వారా ఈనెల 13న ఆ హారాన్ని దేవస్థానానికి అందజేశారు. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానాలకు కూడా ఈ దంపతులు కోటి రూపాయల విరాళం ఇచ్చిన సంగతి తెలిసిందే!

## సంగమేశ్వరస్వామికి..
# 1.37 లక్షల రాబడి



సంగంలోని శ్రీ కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఇటీవల హుండీలు లెక్కించగా స్వామివారికి 1,37,734 రూపాయల రాబడి వచ్చింది. ఈ లెక్కింపును ఆలయ ఇఓ చైతన్య, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

## బుచ్చి.. ప్రసన్నాంజనేయునికి
# వెండి కవచం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పెద్దూరులో ఉన్న సీతా సమేత శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికి ఈనెల 15న బుచ్చికి చెందిన దాతలు వెండితో తయారుచేసిన సర్వాంగ కవచాన్ని బహుకరించారు. ప్రత్యేక అభిషేకాల అనంతరం ఆ కవచాన్ని శ్రీ ప్రసన్నాంజనేయునికి అమర్చి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి సమక్షంలో, దాతలు అత్తిపల్లి కృష్ణమోహన్‌రెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, బద్దిపూడి శ్రీనివాసులురెడ్డి, యేల్చూరి సురేష్, సరాబు సురేష్, ప్రసాద్, రేబాల వెంకటకృష్ణారెడ్డి, గాయత్రి, సుకుమార్ తదితరులను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.

# ఆ చిన్నారులను చూడగానే మనసు చలించిపోయింది
### - - - మంత్రి నారాయణ సతీమణి రమాదేవి - - -




నెల్లూరులోని ప్రగతి చారిటీస్‌లో ఉన్న మానసిక వికలాంగులైన చిన్నారుల పరిస్థితిని చూడగానే తన మనసు కలచివేసిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ సతీమణి రమాదేవి చెప్పారు. ఇటీవల ఆమె ఆ ఛారిటీస్‌లో కొత్తగా కట్టిన విశ్రాంతి గదులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులు పూలతో స్వాగతం పలికారు. ఆమె కొద్దిసేపు వారితో సంతోషంగా గడిపి, బిస్కెట్ ప్యాకెట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ చారిటీస్ నిర్వాహకులైన సురేష్-సుశీల దంపతులను అభి నందించారు. గత 25 ఏళ్లుగా ఈ సేవాసంస్థను నడపడం గొప్ప విషయమన్నారు. మానసిక వికలాంగులైన చిన్నారులను పెంచి పెద్దచేయాలంటే ఎంతో సహనం, ఓర్పు ఉండాలన్నారు. ఆ చిన్నారుల పరిస్థితి చూడగానే వాళ్లకి ఏదో ఒక సాయం చేయాలని అనిపించిందని, వారికి ఎంతో అవసరమైన బాత్‌రూమ్‌లను ఏర్పాటుచేయడంతో వారెంతో సంతోషించి తనకు కృతజ్ఞతలు తెలిపారని ఆమె చెప్పారు.

# అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఈనెల 15న నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వియస్‌యు)లోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కరరావు మాట్లాడుతూ, ప్రఖ్యాత శాస్త్రవేత్తగా..రాష్ట్రపతిగా కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆదర్శాల బాటలో నడవాలన్నారు. వియస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.విజయ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, సహాయక పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుజాత, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. హనుమారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.బి. సాయినాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.విజయకుమార్, శ్యామ్‌సుందర్ భగవాన్ పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

## బాధితులను ఆదుకుంటున్న రెడ్‌క్రాస్



జిల్లాలో భారీవర్షాలతో ఇబ్బందులు పడుతున్న బాధితులను రెడ్‌క్రాస్ సంస్థ ఆదుకుంటోంది. నెల్లూరు ఇందిరమ్మ కాలనీలో రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో కలిసి 300 మంది బాధితులకు ఈనెల 16న రెడ్‌క్రాస్ ఛైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆహార పొట్లాలు, మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాను బాధితులు ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ జైన్, మేనేజింగ్ కమిటీసభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ కో–కన్వీనర్ సురేఖ, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిని సాగునీటి సంఘాల ఎన్నికలు రాష్ట్రంలో భారీవర్షాలు కురుస్తుండడంతో తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఎన్నికల నిర్వహణకు బుధవారం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. అయితే, అధికార యంత్రాంగ మంతా తుఫాన్ సహాయక చర్యల్లో నిమగ్నమై ఉండడంతో, ఈ ఎన్నికలను వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

## సీసీఎస్ ఇన్స్‌పెక్టర్‌గా..రాములు నాయక్

గతంలో నెల్లూరులో నార్త్ ట్రాఫిక్ స్టేషన్‌లో, బాలాజీనగర్, సంతపేట పోలీస్‌స్టేషన్‌లలో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన రాములు నాయక్ నెల్లూరు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులయ్యారు. ఇటీవల దాకా గుంటూరులోని రేంజ్ కార్యాలయంలో ఉంటూ, అక్కడి నుంచి బదిలీపై ఆయన నెల్లూరుకు వచ్చి, ఈనెల 15న బాధ్యతలు చేపట్టారు. అనంతరం, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్‌ను, పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## ఎన్జీఓల కార్యవర్గం

ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా కార్యవర్గంలో ఏర్పడిన ఖాళీ పోస్టులను ఈనెల 15న కోఆప్షన్ ద్వారా భర్తీ చేసుకున్నారు. నగరంలోని ఎన్జీఓ కార్యాలయంలో, జిల్లా సంఘం అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా గాదిరాజు రామకృష్ణ, కోశాధికారిగా వీఎంవీ ప్రసాదరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా పీ.కిరణ్‌కుమార్, పులి సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ఏ.వి కృష్ణకుమార్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి పర్యవేక్షించగా, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఉపాధ్యక్షులు కరుణమ్మ, మధు, కృష్ణంరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా.. ఎన్ఎండి ఫరూక్



నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ నియమితులయ్యారు. ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలకు ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ నియామకాల్లో భాగంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ప్రకాశం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా, పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణను కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు.

## మార్కెటింగ్ యార్డ్‌ను పరిశీలించిన మంత్రి నారాయణ



నెల్లూరు నవాబ్‌పేటలోని డంపింగ్ యార్డ్‌ను, వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్‌ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఇటీవల ఆకస్మికంగా పరిశీలించారు. డంపింగ్ యార్డ్ నిర్వాహణపై అక్కడి సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్‌ను తనిఖీ చేశారు. పలు విషయాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ.10 నాణేలు చెల్లుతాయి

### కెనరాబ్యాంక్ డీజీఎం వెల్లడి




మార్కెట్లో ఏ దుకాణం వారైనా... 10 రూపాయల నాణెం ఇస్తే.. అది చెల్లుతుందో లేదోనని సందేహించేవారికి ఇక ఆ ఇబ్బంది లేదు. ఎంచక్కా 10 రూపాయల నాణేలు తీసుకోవచ్చు..ఇవ్వవచ్చు. చట్టప్రకారం ఇవి చెల్లుబాటవుతాయని కెనరా బ్యాంక్ డెప్యూటీ జనరల్ మేనేజర్ జీవన్ మూర్తి స్పష్టం చేశారు. రిజర్వు బ్యాంకు వారి ఆదేశాల మేరకు, ఈనెల 15న నెల్లూరులోని కెనరాబ్యాంక్ రీజనల్ కార్యాలయంలో 10 రూపాయల నాణేలపై ప్రజలకు బ్యాంకు అధికారులు అవగాహన కలిగించారు. అనంతరం మొబైల్ కరెన్సీ వ్యాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌ప్రదీప్ ఆధ్వర్యంలో అధికారులు రూ.10 నాణేలను పంపిణీ చేయగా, పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఆ నాణేలను తీసుకున్నారు. 10 రూపాయల నాణాలను స్వీకరించవచ్చంటూ నెల్లూరు రీజియన్ ఏజీఎం ఏ.నాగరాజు పోస్టర్లను ఆవిష్కరించారు. బ్యాంకు డివిజినల్ మేనేజర్ ఎస్.మునిశేఖర్, మేనేజర్ స్మృతి, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకే.. సరుకులు

### - జాయింట్ కలెక్టర్ కార్తీక్

ధరలు నియంత్రించేం దుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తిన కార్తీక్ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని నవాబ్‌పేట రైతు బజారులో వినియోగదారులకు తక్కువ ధరకు వంట నూనెలు అందించే కౌంటర్‌ను, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగ దారులకు నాణ్యమైన బిపిటి రకం బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవరాయిల్‌ను తక్కువ ధరకు అందించేందుకు జిల్లాలో 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా కందిపప్పు కేజీ రూ.150, బీపీటీ రకం స్టీమ్ రైస్ కేజీ రూ. 45, ముడిబియ్యం కేజీ రూ.47లకు, పామాయిల్ లీటర్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను లీటరు 124 రూపాయల వంతున విక్రయిస్తున్నామన్నారు. ఒక్కో రేషన్ కార్డుపై 3 లీటర్ల పామోలిన్, ఒక లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా టమోటాలను కేజీ 42 రూపాయలకు, ఉల్లిపాయలు కేజీ 32 రూపాయలకు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎస్ఓ వెంకటరమణ, మార్కెటింగ్ శాఖ అధికారిణి అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీ ఆంజనేయస్వామి జన్మనక్షత్రమైన పూర్వాభాద్ర రోజు (ఈనెల 15)న నెల్లూరు నగరంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలోనూ, పప్పులవీధిలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో స్వామివారిని సింధూరం, తమలపాకులు, ఎర్రని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు చేపట్టారు. పలు ఆలయాల్లో సామూహిక హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు.

## చేతుల శుభ్రతపై అవగాహన




చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చని, ముఖ్యంగా చిన్నపిల్లలు, విద్యార్థులు చేతుల పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలని స్థానిక నారాయణ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాదరెడ్డి చెప్పారు. గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా ఈనెల 15న నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే జలుబు, శ్వాసకోశ సమస్యలు బాగా తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి అడిషనల్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఆర్.హరీష్, డాక్టర్ అరుణ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో.. బాబా మహాసమాధి ఆరాధనలు



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయి దర్బార్ అద్దాల మందిరం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ షిరిడీ సాయినాథునికి ఆలయ నిర్వాహకులు ఇటీవల ప్రత్యేకపూజలు చేశారు. శ్రీ సాయిబాబా 106వ మహాసమాధి ఆరాధనోత్సవాలు, మరోవైపు విజయదశమి వేడుకలను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పెద్దఎత్తున పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మందిరం ఛైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో, బాబా భక్తుల సమక్షంలో సాయినాథునికి విశేష పుష్పాలంకరణలు చేశారు. ప్రత్యేక అభిషేకాలు, షిరిడీ హారతులు, నక్షత్ర హారతులు, 306 జ్యోతుల ప్రజ్వలనతో సాయిదేవుడి సన్నిధి కళకళలాడింది. సాయి సచ్చరిత, మహాసమాధి ఘట్టం పారాయణంతో, సాయి నామోచ్ఛారణలతో ఆలయం మార్మోగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయిదర్బార్ గౌరవసలహాదారు.. ప్రముఖ దాత పాటోలు రామసుబ్బయ్య, సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యుల పర్యవేక్షణలో ఈ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. మోదెం మల్లికార్జునరావు, భారతి, కనిశెట్టి సురేష్‌బాబు, సరస్వతి, సన్నపురెడ్డి సుకన్య తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.




### వెన్నెముక సమస్యలను

## నిర్లక్ష్యం చేయొద్దు

వెన్నెముక సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, ఏ చిన్న నొప్పి ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్సలు చేయించుకోవాలని నెల్లూరులోని మెడికవర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ దినేష్ చెప్పారు. ఈ నెల 15న ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా, మెడికవర్ ఆసుపత్రిలో ఆయన రోగులకు వెన్నెముక సమస్యలపై అవగాహన కలిగించారు. మంచి అలవాట్లతో పాటు, తగిన వ్యాయామం చేయడం ద్వారా అధికశాతం సమస్యలను నివారించుకోవచ్చని సూచించారు.

# ఎట్టకేలకు మైపాడు రోడ్డు విస్తరణ పనులు

## • ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఎట్టకేలకు ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న నెల్లూరు-మైపాడురోడ్డులో ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభ మయ్యాయి. దీంతో, మైపాడు సాగర తీరంలో పర్యాటక అభివృద్ధికి బాటలు వేసినట్లే. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల నెల్లూరు-మైపాడు మధ్య నిర్మాణం తలపెట్టిన 18.5 కిలోమీటర్ల ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. ఇందుకూరుపేట మండలం నరసాపురం వద్ద టీడీపీ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఇందుకూరుపేట మండల అభివృద్ధికి మైపాడు రోడ్డు విస్తరణ ఎంతో దోహద పడుతుందన్నారు. మైపాడు బీచ్ సందర్శించే పర్యాటకులకే కాకుండా, గంగపట్నం వెళ్లే శ్రీ చాముండేశ్వరి అమ్మవారి భక్తులకు ఈ రోడ్డు ఉపయోగంగా వుంటుందన్నారు. వందలాది వాహనాలతో నిత్యం రద్దీగా వుండే మైపాడురోడ్డు విస్తరణతో రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా, ఈ ప్రాంత రైతాంగానికి, మత్స్యకారులకు, వాహనాల రాకపోకలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మైపాడు రోడ్డు ఫోర్ లైన్ విస్తరణ పనులకు సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ ద్వారా కేంద్రం నుంచి 48 కోట్ల రూపాయలు నిధులు సాధించడంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి పాత్ర అభినందనీయమని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ రోడ్ల నిర్మాణానికి సంబంధించి 64కోట్ల రూపాయల వ్యయంతో అంచనాలు రూపొందించి ఉన్నామని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట టీడీపీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్రనాయుడు, నాయకులు సురేష్‌నాయుడు, కొండూరు సుధాకర్‌రెడ్డి, బిజెపి నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి రథోత్సవంలో.. ప్రశాంతమ్మ

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇటీవల అంగరంగ వైభవంగా జరిగిన రథోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగారు. టీటీడీ ఇవో శ్యామలరావు, జెఇఓ వెంకయ్యచౌదరి తదితరులు స్వామివారి వాహన సేవలో పాల్గొన్నారు.



## వేమిరెడ్డితో.. క్రిష్ణయ్య భేటీ

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఛైర్మన్ డాక్టర్ పి. క్రిష్ణయ్య ఇటీవల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పీసీబీ ఛైర్మన్ అయ్యాక, తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన కృష్ణయ్య స్థానిక మాగుంట లేఅవుట్‌లోని వేమిరెడ్డి నివాసానికి వెళ్లి వేమిరెడ్డి దంపతులతో భేటీ అయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి వారు పలు విషయాలపై చర్చించుకున్నారు. కాలుష్య రహిత పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని ప్రస్తావిస్తూ, పర్యావరణ పరిరక్షణ దిశగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. ఆయన వెంట నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ కూడా ఉన్నారు.

## ఎకనమిక్ టైమ్స్ వారి జాతీయ అవార్డు సాధించిన

# డాక్టర్ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డి



మన నెల్లూరీయుడు, ప్రముఖ ఇఎన్‌టి నిపుణుడు డాక్టర్ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డి మరో ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రఖ్యాత మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రతి ఏటా దేశంలోని తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ ప్రాంతాల నుంచి వైద్య ఆరోగ్య రంగంలో వివిధ విభాగాల నుండి ఎంపికచేసి అందించే జాతీయ అవార్డులలో ఈ ఏడాది ఇఎన్‌టి మరియు ఫేషియల్ సర్జరీ విభాగంలో దక్షిణ భారతదేశం నుండి డాక్టర్. విష్ణు నేతృత్వంలో సేవలందిస్తున్న హైదరాబాద్ కేర్ ఆసుపత్రిని ఎంపిక చేసింది. ఇటీవల ఎకనమిక్ టైమ్స్ ప్రతినిధులు డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డిని ఆయన బృందాన్ని కలిసి ఈ అవార్డుని అందజేశారు. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్న విష్ణు, ఇప్పుడు మరో ఘనతని సాధించారు. డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# అక్షరాస్యతతోనే అభివృద్ధి

**- జిల్లా కలెక్టర్ ఆనంద్**



అక్షరాస్యతతోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఉల్లాస్' కార్యక్రమానికి సంబంధించి ఈనెల 15న జిల్లాస్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 19,178 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 15 సంవత్సరాల పైబడి ఉన్న నిరక్షరాస్యులు, గతంలో మధ్యలో బడి మానేసిన వారు ఈ కార్యక్రమం ద్వారా చదువుకోవచ్చన్నారు. స్వయం సహాయక బృందాల్లోని నిరక్షరాస్యులు, ప్రభుత్వ పాఠశాలలో, అంగన్‌వాడీల్లో పనిచేసే ఆయాలు, వంట చేసేవారు, హెల్పర్లు తదితరులు కూడా వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమం ఆరునెలల పాటు నిర్వహిస్తామని తెలియజేశారు.

# ఎన్‌బికెఆర్‌కి.. 'న్యాక్-ఏ గ్రేడ్' గుర్తింపు

## • అధ్యాపకులను అభినందించిన రామ్‌కుమార్‌రెడ్డి



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఇటీవల ప్రతిష్టాత్మకమైన 'న్యాక్' (నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్) నుంచి ఉత్తమస్థాయిలో ఏ-గ్రేడ్ లభించింది. ఇటీవల ఆ కళాశాలను న్యాక్ పీర్ టీమ్ (అధ్యాపకుల బృందం) సందర్శించి, అక్కడ జరుగుతున్న బోధనా పద్ధతులను పరిశీలించింది. సైన్స్ ప్రయోగశాలలు, గ్రంథాలయ సౌకర్యం, బొటానికల్ గార్డెన్, ప్లేగ్రౌండ్, ఇన్‌డోర్ స్టేడియం, కంప్యూటర్ సెంటర్, మహిళా సాధికార విభాగం వగైరాలన్నిటినీ ఆ బృందంవారు సందర్శించారు. విద్యార్థుల తల్లితండ్రులు, పేరెంట్స్ కమిటీలు, పూర్వ విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో విడివిడిగా సమావేశమై కళాశాలలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ పీర్ టీమ్‌లో డా.ఎం.సి దిలీప్ కుమార్(ఛైర్మెన్), సభ్యులు-సమన్వయ కర్తగా డా. ఆర్.ఖాన్, మరో సభ్యుడు డా. కె.రాజ్‌కుమార్ పాల్గొని కళాశాలకు సంబంధించిన పలు అంశాలపై పరిశీలనలు జరిపారు. ఆ తర్వాత వారు సమగ్ర నివేదికను బెంగుళూరులోని న్యాక్ ప్రధాన కార్యాలయానికి సమర్పించారు. అన్ని పరిశీలనలు పూర్తయ్యాక న్యాక్ వారు ఎన్‌బికెఆర్‌కి ఏ గ్రేడ్‌తో పాటు 3.22 సీజీపీఏని ప్రకటించారు. దీంతో కళాశాలకు న్యాక్ నుంచి మంచి గుర్తింపు రావడంతో ఎన్‌బికెఆర్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రామకృష్ణారెడ్డి, ఐ క్యూ ఏసీ కోఆర్డినేటర్ టి.రాజేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబంది పాల్గొన్నారు.

## పూండ్ల వెంకురెడ్డి నేతృత్వంలో..

# వేడుకగా దసరా ఉత్సవాలు



పొదలకూరు మండలం, మహమ్మదాపురంలోని శేషాద్రి నగర్‌లో దశరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పూండ్ల వెంకురెడ్డి నేతృత్వంలో దుర్గాదేవి అమ్మవారికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, సేవలు జరిగాయి. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, పందరి భజనలు, ఆటల పోటీలు కోలాహలంగా నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు శివారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి.



## భువనేశ్వరమ్మకు ప్రశాంతమ్మ ఆత్మీయ పలకరింపు

విజయదశమి విశిష్టతను చాటి చెప్పేలా ఇటీవల విజయవాడ పున్నమి ఘాట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'నారీ శక్తి విజయోత్సవ్' కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులతో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం మంత్రి దుర్గేష్, పలువురు మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును, ఆయన సతీమణి భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

## 'లక్కీడిప్'తో మద్యం దుకాణాలు



జిల్లాలో ఈసారి లక్కీడిప్ వేసి మద్యం దుకాణాలను కేటాయించారు. ఈనెల 14న ఆ ప్రక్రియ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. నెల్లూరులోని కస్తూర్బా కళా క్షేత్రంలో జరిగిన మద్యం కేటాయింపుల కోసం భారీగా చేరుకున్న టెండరు దరఖాస్తుదారులతో కళాక్షేత్రం కిటకిటలాడింది. సోమవారం ఉదయం లక్కీడిప్ ప్రక్రియను కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌ల సమక్షంలో, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించారు. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు 3872 టెండర్లు రాగా, 182 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 182 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ లక్కీడిప్ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రమేష్, డిపో సూపరింటెండెంట్ ఆయోషా బేగం, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

# అట్టహాసంగా 'రావణ దహనం'

## వేలాదిగా తరలివచ్చిన భక్తజనసందోహం



విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలో ఈసారి దేవీనవరాత్రుల వేడుకలు అట్టహాసంగా జరిగాయి. దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం మనసులను బాగా ఆకట్టుకుంది. విజయ దశమి రోజున మహిషాసురమర్దిని అలంకారాన్ని నేత్రపర్వంగా చేయడం అందరికీ తెలిసిందే. అయితే, అదే విజయ దశమినాడు శ్రీరామునిచే రావణ సంహారం కూడా జరిగింది కనుక, ఉత్తర భారతదేశంలో ఆరోజున 'రావణ దహనాన్ని' పెద్దఎత్తున సంబరంగా చేస్తారు. ఆ సంప్రదాయాన్ని శ్రీధర్‌రెడ్డి దక్షిణాన మన నెల్లూరులో కూడా ప్రవేశపెట్టి భక్తులను అలరించడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డే అపర శ్రీరామునిలా ధనుస్సు చేతపట్టి, 'జై శ్రీరామ్' అంటూ పెద్దపెట్టున జయజయధ్వానాలు చేస్తూ రావణాసురుని కటౌట్‌పై బాణం వేయగా, పది తలల రావణాసురుడి తలల్లోంచి





విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతుండగా, కన్నులపండువగా జరుగుతున్న అమ్మవారి అలంకారాలను దర్శించుకుని తరించేదుకు నిత్యం వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో, ఆలయ నిర్వాహకులు, అధికారులు వేడుకల ఏర్పాట్లను భారీఎత్తున చేశారు. అందులోనూ ఈ ఉత్సవాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా, 'రావణ దహనం' కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించడం భక్తుల మంటలు చెలరేగి, దగ్ధం కావడంతో భక్తులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. జై శ్రీరామ్ అంటూ భక్తజనులు కూడా గొంతులు కలపడంతో ఆ ప్రాంత మంతా శ్రీరాముని నామోచ్ఛరణలతో మార్మోగిపోయింది. విల్లును తొలుత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మిత్రబృందం వారు ఊరేగింపుగా తీసుకు వచ్చి శ్రీధర్‌రెడ్డి చేతికి అందించారు. అత్యంత అధునాతనమైన రీతిలో టపాకాయలతో రూపొందించిన రావణాసురుని భారీ కటౌట్, బాణం వేయగానే పెద్దపెద్ద పేలుళ్లతో మండిపోతూ.. రావణ దహనం జరిగిన తీరు భక్తులను మంత్రముగ్ధులను గావించిందంటే అతిశయోక్తి కాదు. ఆ అద్వితీయ దృశ్యాలను, బాణసంచా వేడుకలను కళ్లారా తిలకించ డానికి నగరంలోని దూరప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తజనం తరలి రావడంతో రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద నుంచి కరెంటాఫీసు కూడలి వరకు ఆ ప్రాంతమంతా క్రిక్కిరిసి పోయింది. ఎటుచూసినా భక్తజనసంద్రంగానే కనిపించింది. దాదాపు 10 నిమిషాల పాటు బాణసంచా పేలుళ్లతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. అనంతరం, 27 పుణ్యనదుల నుంచి పవిత్ర జలాలను డ్రోన్‌లతో భక్తులపై చల్లుతుంటే, భక్తులంతా పులకించి పరవశించిపోయారు. ఇంత దిగ్విజయంగా రావణ దహనం జరగడం ఎంతో సంతోషంగా ఉందని, వచ్చే ఏడాది ఇంకా పెద్దఎత్తున వీఆర్‌సీ మైదానంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు.

### తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు మండలం కొండగుంట, తిమ్మసముద్రం, వెంకటేశు పల్లి గ్రామాల్లో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఇటీవల ఆయన ప్రారంభించారు. కొండగుంటలో రూ. 10లక్షలు, తిమ్మసముద్రంలో రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎంపీడీవో మధుసూధనరావు, తహశీల్దార్ చంద్రశేఖర్, నాయకులు నెలబల్లి భాస్కరరెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా సాధనలో రాష్ట్ర పాలకులు విఫలం

### - సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పాలకుల పద్ధతులు మారలేదని, ప్రత్యేకహోదా సాధనలో వారు విఫలమయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఇటీవల గూడూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు వైఖరి మారాలని, కేంద్రం ఇచ్చే అరకొర నిధులతో రాష్ట్రాభివృద్ధి సాధ్య పడదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నారని, ఉద్దేశపూర్వకంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యం పాలసీ కొత్త సీసాలో పాతసారా అన్న చందంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇసుక ఉచితంగా అందిస్తామని ఇచ్చిన హామీని వందరోజులు దాటినా ఎందుకు అమలు చేయలేదని విమర్శించారు. తిరుమల లడ్డూ వివాదంలో దేవుడిపై రాజకీయాలు చేయడం తగదన్నారు. పవన్‌కళ్యాణ్ చేగువేరా సిద్ధాంతాన్ని



పక్కనపెట్టి సావర్కర్ సిద్ధాంతాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



గూడూరు ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, మయూరి శ్యాంయాదవ్ భారత రత్న అబ్దుల్‌కలాం 93వ జయంతి వేడుకలు ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ సయ్యద్ తాజుద్దీన్, కళాశాల లెక్చరర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన మద్యం దుకాణాల కేటాయింపు

గూడూరు పట్టణం చిల్లకూరు మండలానికి సంబంధించి 18 మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ పద్ధతిలో ఇటీవల ముగిసింది. రెండు వారాలుగా మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయా అన్న సందేహంలో ఉన్న ఆశావహుల ఉత్కంఠకి తెరపడింది. గూడూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలో 12, చిల్లకూరు మండలంలో 6 దుకాణాలకు మొత్తం 209 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తిరుపతిలో నిర్వహించిన లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించారు.

# రాజకీయ లబ్ధికోసం.. భారత్‌పై కెనడా నిందలు

కెనడా మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆ దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న జస్టిన్ ట్రూడో ప్రభుత్వం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి భారత్‌పై మళ్లీ నిరాధార ఆరోపణలు చేసింది. ఈసారి ఏకంగా కెనడాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్‌వర్మతో పాటు ఇతర దౌత్యవేత్తలను అనుమానితులుగా పేర్కొని, రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించింది. సంజయ్‌కు అంతర్జాతీయ దౌత్యవేత్తగా తిరుగులేని రికార్డు ఉంది. 36 సంవత్సరాలుగా ఆయన భారత్‌కు విదేశాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కెనడా పౌరసత్వం ఉన్న హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకేసు దర్యాప్తులో భాగంగా ఆయనను అనుమానితుడిగా పేర్కొంటూ, తీవ్రమైన నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా కెనడా తన అల్పబుద్ధిని చాటుకుంది. కెనడా చర్యపై భారత్ భగ్గుమంది. కెనడాలో భారత హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యాధికారులను ఉపసంహరించుకుంది. వారికి భద్రత కల్పించే విషయంలో కెనడాపై తమకు విశ్వాసం లేదని భారత్ భావించింది. మరోవైపు భారత్‌లోని ఆరుగురు కెనడా దౌత్యాధికారులు ఈ నెల 19లోపు దేశం విడిచివెళ్లిపోవాలని కూడా ఆదేశించింది. దీంతో రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు బలహీన స్థాయికి చేరుకున్నాయని భావించవచ్చు.



## ఓటు బ్యాంకు రాజకీయాలు :

వాణిజ్యపరంగా రెండు దేశాలు పరస్పరం ముఖ్యమైన భాగస్వాములే. అయినా కెనడా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడానికి కారణం.. అక్కడి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న జస్టిన్ ట్రూడోకు, ఆయన పార్టీకి సంప్రదాయంగా భారత్‌పై ఉన్న వ్యతిరేకత ఒక ప్రధాన కారణం కాగా, కెనడాలో స్థిరపడ్డ సిక్కు వర్గం ఓట్లను రాబట్టేందుకు గాలం వేయడం మరో ప్రధాన కారణం. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ సైన్యంలో పంజాబ్‌కు చెందిన వారు కూడా ఉండేవారు. బ్రిటీష్ సైన్యంలో పనిచేసే కొంతమంది సైనికులను 1897లో తొలిసారి కెనడాలోని బ్రిటీష్ కొలంబియాకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన ఉపాధి కోసం వలసలు వెళ్లడం ప్రారంభమయింది. దాదాపు వందేళ్లకుపైగా భారత్‌లోని పంజాబ్ నుంచి కానీ, పాకిస్థాన్‌లోని పంజాబ్ నుంచి కానీ సిక్కు వర్గానికి చెందినవారు కెనడాకు వలసలు వెళ్తున్నారు. అక్కడి జనాభాలో సిక్కులు దాదాపు 2.6శాతం ఉన్నారు. ఎక్కువగా బ్రిటీష్ కొలంబియాలో ఆ వర్గం ఉంది. కెనడాలో 338మంది ఎంపీల్లో 18 మంది సిక్కువర్గానికి చెందిన వారే. అందుకే అక్కడి పార్టీలు, సిక్కువర్గం అసంతృప్తికి గురయ్యే చర్యల పట్ల ఆచితూచి వ్యవహరిస్తాయి. 2021లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ట్రూడో పార్టీకి 160 స్థానాలు మాత్రమే వచ్చాయి. సాధారణ ఆధిక్యానికి పది సీట్లు తక్కువ కావడంతో జగ్మీత్‌సింగ్‌కు చెందిన న్యూ డెమొక్రటిక్ పార్టీతో (16 స్థానాలు) కలిసి జస్టిన్ ట్రూడో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పుడు జగ్మీత్‌సింగ్ ట్రూడోకు మద్దతు ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రభుత్వం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ట్రూడో ప్రభుత్వంపై ప్రజల్లో బాగా వ్యతిరేకత ఉంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సిక్కువర్గం మద్దతు కూడగట్టుకోవడానికి ట్రూడో ప్రభుత్వం భారత్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నట్లు కనబడుతోంది.

## నిజ్జర్ హత్య ఒక సాకు :

కెనడా పౌరసత్వం ఉన్న నిజ్జర్‌ను భారత్ 2020లో ఉగ్రవాదిగా గుర్తించింది. భారత్‌లో ప్రత్యేక ఖలిస్థాన్ కోరుతూ సాగిస్తున్న భారత వ్యతిరేక కార్యకలాపాల్లో నిజ్జర్ చురుగ్గా పాల్గొంటున్నట్లు తెలుసుకుంది. కెనడాలోని వాంకోవర్ శివారుల్లో 2023 జూన్ 18న గుర్తుతెలియని వ్యక్తులు నిజ్జర్‌ను కాల్చి చంపారు. ఈ హత్యలో భారత ఏజెంట్ల హస్తముందని ట్రూడో ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా లారెన్స్ బిష్ణోయ్ ముఠా, భారత ఏజెంట్లు కలిసి కెనడా భూభాగంపై పనిచేస్తున్నారని కెనడా పోలీసులు ఆరోపించారు. ఆ ఆరోపణలను ట్రూడో సమర్థించారు. నిరాధార ఆరోపణలు చేయవద్దని, ఆధారాలుంటే సమర్పించాలని ఏడాదికాలం నుంచి భారత్ పదే పదే చెబుతున్నా వినకుండా మళ్లీ మళ్లీ అవే ఆరోపణలు చేయడం వెనక కెనడా అంతర్గత రాజకీయ కారణాలు తప్ప మరోటి లేదనే తెలుస్తోంది. పైగా నిజ్జర్ హత్య కేసు విషయాలను కెనడాకు ముఖ్య భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకేతో పంచుకుంటున్నట్లు ట్రూడో చెప్పారు. నిరాధార ఆరోపణలు చేయడమే కాకుండా, అంతర్జాతీయంగా భారత్ గౌరవానికి భంగం కలిగేలా ట్రూడో చర్యలున్నాయి. మరోవైపు అమెరికా కూడా కెనడాతో స్వరం కలిపింది. కెనడా దర్యాప్తునకు సహకరించాలని సన్నాయి నొక్కులు నొక్కుతోంది. ఆధారాలు లేని కేసులో సహకారమెలాగో అమెరికానే సెలవివ్వాలి మరి!..

## వాణిజ్యంపై ప్రభావం పడుతుందా?

భారత్‌లో కెనడా సంస్థల పెట్టుబడులు గణనీయంగానే ఉన్నాయి. విదేశీ పెట్టుబడుల్లో కెనడా 18వ అతిపెద్ద ఆర్థిక భాగస్వామి. ముఖ్యంగా కెనడా పింఛను నిధుల నుంచి భారత ఈక్విటీ, స్థిరాస్తి మార్కెట్లో పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. కెనడా నుంచి భారత్‌కు పెద్దఎత్తున పప్పుధాన్యాలు దిగుమతి అవుతాయి. 2023లో అన్ని రకాల పప్పుధాన్యాల దిగుమతుల్లో సగానికిపైగా కెనడా నుంచే ఉన్నాయి. అలాగే భారత్‌కు చెందిన ఆదిత్య బిర్లా గ్రూప్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలు కెనడాలో వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. విద్యారంగానికి వస్తే కెనడాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో దాదాపు 40శాతం మంది భారతీయులే. ఈవిధంగా, మన దేశం నుంచి అక్కడి విద్యారంగానికి ఆదాయం అందుతోంది. అయితే, దౌత్యపరమైన సంబంధాలు దిగజారినా, క్షేత్రస్థాయిలో వాణిజ్య సంబంధాలకు వచ్చిన ముప్పేమీ ఉండకపోవచ్చని వాణిజ్యవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎందుకంటే వాణిజ్యంలో సింహభాగం సంస్థల మధ్య జరిగిన ఒప్పందాలేనని, దేశాల మధ్య జరిగిన ఒప్పందాలు కావని పేర్కొంటున్నాయి. చైనాతో గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్–చైనా మధ్య వాణిజ్య భాగస్వామ్యం పెరిగిందే కానీ తగ్గలేదని ఈ సందర్భంగా అవి గుర్తుచేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల ప్రజలు మెరుగైన జీవనాన్ని కోరుకుంటున్నారు. అందుకు విలువైన వాణిజ్య భాగస్వామ్యాలు అవసరం. దానికి దేశాల మధ్య విశ్వాసపూరితమైన మైత్రి అవసరం. తాత్కాలికమైన రాజకీయ ప్రయోజనాల కోసం, ఉగ్రవాద చర్యలకు ఊతమిచ్చే కొంతమంది వ్యక్తుల కోసం విలువైన మైత్రికి తూట్లు పొడవాలనుకోవడం తెలివైన వ్యూహం కానేకాదు. ఆ విషయాన్ని కెనడా గుర్తించాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**

---



## జానకిరామ.. రామాయణం 35

**- ఊటుకూరు జానకి రామారావు**

రాముడు తన కుడి చేతితో సుమంత్రుని స్పృశిస్తూ ఇక నీవు తిరిగి వెళ్ళి రాజును కనిపెట్టుకొని ఉండు అని పలికాడు.

అప్పటిదాకా రాముడితో కలిసి వున్న సుమంత్రుడు తిరిగి వెళ్ళాల్సి వచ్చేటప్పటికి కరిగి నీరైనాడు... రామా! నీ కష్టాలు చూస్తుంటే ఋజుత్వానికి గానీ, బ్రహ్మచర్యానికి గానీ, వేదాధ్యయనానికి గానీ, మృదుత్వానికి గానీ ఫలం లేదు అనిపిస్తుంది!

నీ కష్టాలు భరించగలగటం నీవలననే సాధ్యం. లోకంలో ఏ ఒక్క పురుషుడి వల్లకూడా కాదు సుమా! (ఈ మూడురోజులకే ఇట్లా అంటు న్నాడీయన, ఇక ముందు ఏమి కానున్నదో ఈయనకు తెలియదు).

మేమెంత దురదృష్టవంతులం! నీకు దూరమై, పాపాత్మురాలైన ఆ కైక వశులమై ఇక బ్రతుకీడ్చాలి.. అని పరిపరివిధాలుగా దుఃఖిస్తున్న సుమంత్రుని చూసి రాముడు, సుమంత్రా ఇన్ని వేల సంవత్సరాలనుండీ రాజులు పరిపాలిస్తున్నారు, రాజాజ్ఞ అనుల్లంఘనీయం, అప్రతిహతం కదా! అయినా అడవిలో జీవించవలసినందుకు నేనుగానీ, సీతగానీ, లక్ష్మణుడుగానీ ఏ మాత్రం బాధపడటంలేదు. పద్నాలుగేండ్లు ఎన్నాళ్ళలో తిరిగి వస్తాయి చెప్పు, మేం ఇలా వెళ్ళి అలా తిరిగి వస్తాం. అయోధ్యలో మరల మీ అందరితో కలిసి ఆనందంగా కాలం గడుపగలం. కావున, నీవు విచారించకు అని పలికి అయోధ్యలో అందరికీ పేరుపేరునా తన నమస్కారాలు తెలియచేయమన్నాడు.

రామా నిన్ను విడిచి నేను వెళ్ళలేను, నిన్ను విడిచి ఉండలేనయ్యా! నీ భక్తుడను, నీ భృత్యుడను, మర్యాద కాపాడువాడను నన్ను విడువకయ్యా, నీతోటే ఉంటాను.. నాకు అనుజ్ఞ ఇవ్వు అని సుమంత్రుడు రాముని వేడుకుంటున్నాడు.

సుమంత్రా! నీవు తిరిగి వెళ్ళకపోతే మా అమ్మ కైకేయికి నేను అరణ్యానికి వెళ్ళాననే నమ్మకం కలిగేదెట్లా? అందుకోసమైనా నీవు తిరిగి వెళ్లాలి... అని సుమంత్రుని సమాధానపరిచాడు.

గుహుని వైపు తిరిగి, మిత్రమా మర్రిపాలు తెప్పించవయ్యా జటాధారిని కావాలి నేను! అని పలికాడు.

గుహుడు తెప్పించిన మర్రిపాలు జుట్టుకు తను రాసుకొని, తమ్ముడు లక్ష్మణునికి తానే స్వయంగా రాశాడు రాముడు.

నార చీరలుకట్టి జటలు ధరించిన సోదరులిరువురూ ఋషులలాగా శోభిల్లారు.

మిత్రమా గుహా! సైన్యం, ధనాగారం, దుర్గం... ఈ మూడింటి విషయంలో ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా ఉండు. రాజ్యం పరిపాలించుట చాలా కష్టమని పెద్దలు చెపుతున్నారు, అని రాముడు పలికి అతనిని వీడుకొల్పి నావ వద్దకు వెళ్లాడు.

లక్ష్మణుడు ముందుగా సీతమ్మను నావ ఎక్కించి, తాను ఎక్కాడు, ఆ తరువాత రాముడు నావ ఎక్కి కూర్చున్నపిదప గుహుడు నావను అవతలి ఒడ్డుకు చేర్చమని ఆజ్ఞాపించాడు.

రాముడు నావెక్కిన వెంటనే తన శ్రేయస్సును కోరుతూ నావెక్కే టప్పుడు జపించే మంత్రాన్ని జపించాడు.

నావ గంగానది మధ్యకు చేరింది!

అప్పుడు సీతమ్మ గంగమ్మను ప్రార్థించింది. ఆవిడకు మొక్కుకుంది.

అమ్మా! వనవాసం నుండి మేం క్షేమంగా తిరిగి వచ్చిన పిదప నిన్నుకొలుస్తానమ్మా!

నీ సంతోషం కోసం బ్రాహ్మణులకు లక్షలగోవులు, అన్నవస్త్రాలు ఇస్తాను. నీ ఒడ్డున ఉన్న సమస్తదేవతలను పూజించు కుంటాను.... ఇలా ఆవిడ మొక్కులు మొక్కుకుంటూ ఉండగనే నావ దక్షిణపు ఒడ్డును చేరుకుంది.

రాముడు నావ దిగాడు. మెల్లగా సీతమ్మకు చేయి అందించి సుతారంగా పట్టుకొని దింపాడు, ఆ తరువాత లక్ష్మణుడు కూడా దిగాడు.

అది నిర్జన ప్రదేశం! లక్ష్మణుడితో కూడి సీతారాములు నడక మొదలుపెట్టారు. ముందు లక్ష్మణుడు ఆ వెనుక సీత వారిరువురినీ కాచుకుంటూ వెనుక రామచంద్రుడు. సీతమ్మ భద్రంగా రామలక్ష్మణుల మధ్యలో నడువసాగింది.

నడుస్తూ మాట్లాడుకుంటున్నారు. వనవాసంలో కష్టాలేమిటో ఇక నుంచి సీతకు బాగా అర్థమవుతయిలే(రావద్దంటే పట్టుబట్టి భర్తమీద అలిగి మరీ వచ్చిందిగా సీతమ్మ, ఇహ రామయ్య మొదలుపెట్టాడు ఆవిడకు కష్టాలగురించి చెప్పటం! ఇది దెప్పిపొడుపేనేమో).. ఏ పని అయినా మన చేయిదాటిపోతే దానిని సరిచేయటం చాలా కష్టం!

ఈ వనంలో జనులుగానీ, పొలాలుగానీ, తోటలుగానీ ఉండవు! మిట్టపల్లాలు, లోతైన లోయలు ఉంటాయి అట్లాంటి వనంలోకి సీత ఈనాడు ప్రవేశిస్తుంది.

నడిచీ, నడిచీ బాగా ఆకలి వేస్తుంది ముగ్గురికీ.



అప్పుడు లక్ష్మణుడు వరాహం, దుప్పి, నల్లచారల దుప్పి, ఋష్యం అనే మహా మృగాలను ఆహారంగా చేసి, రాత్రి విశ్రమించటానికి ఒక చక్కటి చెట్టు మొదలు చూసుకొని దాని క్రిందకు చేరారు.

ఆ రాత్రి కీకారణ్యంలో మొదటిరాత్రి వారు ముగ్గురికి.

సాధారణమానవుడై జరిగిన విషయాలు తలచుకొని దుఃఖితుడయ్యాడు మరలా రామచంద్రమూర్తి.

లక్ష్మణా! నా తల్లి కౌసల్య పూర్వజన్మలో ఏ తల్లిబిడ్డలను విడదీసిందో కానీ ఆవిడకు పుత్రవియోగం ప్రాప్తించింది. అంతటి మహా ధార్మికుడైన మనతండ్రికి ఈ వయస్సులో ధర్మం, అర్థం కంటే కామమే ప్రధానమైంది కదా!

ఈ లోకంలో ఎవడైనా తనకు అత్యంత విధేయుడైన కుమారుడిని ఒక ఆడుదాని మాటమీద విడిచేవాడుంటాడా?.

ముదిమి వయస్సులో నేను దూరమయ్యానన్న దిగులుతో రాజు మరణిస్తాడు, భరతుడు రాజ్యాన్ని నిష్కంటకంగా ఏలుకుంటాడు.

చూడబోతే ఈ కైక నన్ను అడవులపాలు చేయడానికి, దశరథుడిని చంపడానికి, భరతుడిని రాజు చేయడానికే మన ఇంట చేరిందేమో అని అనిపిస్తుంది.

కైక తనకు కలిగిన ఈ సౌభాగ్యంతో కన్నుమిన్ను గానక కౌసల్యా, సుమిత్రలను కష్టపెడుతుందేమో!

లక్ష్మణా! నీవు రేపు తెల్లవారగనే తిరిగి అయోధ్యకు వెళ్ళిపో! అనాథ అయిపోయిన నా తల్లిని రక్షించు.

ఇది అమ్మకు దగ్గర ఉండి సేవ చేయవలసిన సమయం.

తల్లికి అనంతమైన శోకం కలిగిస్తున్నాను నేను. ..(సశేషం)

## కళ్యాణ వైభోగం...!





### డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి - డాక్టర్ సంధ్య

వాణిజ్య పన్నుల శాఖ డెప్యూటీ కమిషనర్‌గా నెల్లూరులో దీర్ఘకాలం సేవలందించి, అనంతరం పదోన్నతిపై విజయవాడకు వెళ్లి ప్రస్తుతం అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సలిపెల కృష్ణమోహన్‌రెడ్డి - శ్రీమతి నిర్మల కుమారుడు **డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి - డాక్టర్ సంధ్య** (ఎన్‌టిఆర్ జిల్లా, నున్న వాస్తవ్యులు పోలారెడ్డి రజనీకుమార్ - శ్రీమతి అరుణల కుమార్తె)ల వివాహ మహోత్సవం అక్టోబర్ 13వ తేదీ విజయవాడలో వైభవంగా జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# అంతా మాయే!

(మొదటిపేజీ తరువాయి)

గత మూడు నెలలుగా దేశంలో ఇలాంటి ఫోన్ కాల్స్ సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. సైబర్ కేటుగాళ్ళ మోసానికి సామాన్యులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజనీర్లు, డాక్టర్లు, చివరికి విద్యార్థినీవిద్యార్థులు కూడా హడలి పోతున్నారు. వీళ్ళు ఎక్కడనుండి కాల్ చేస్తున్నారో మనం కనుక్కోవడం అసాధ్యం. వాళ్ళు నిజమైన వాళ్ళా, లేక మోసగాళ్ళా అని కనిపెట్టడం కూడా కష్టమే. ముందుగా మృదువుగా మాట్లాడుతారు. ఆ తరువాత కఠినంగా కనపడతారు. చాలా చాకచక్యంగా మనల్ని వాళ్ళ మాయలో పడేస్తారు. మెల్లగా మనల్ని ముగ్గులోకి దించేస్తారు. ఆ తరువాత మన కొంప ముంచేస్తారు.

నవరసాలు పోషించి మనల్ని వశపరుచుకుంటారు. క్రమేణా ఒక్కొక్కటిగా మన విషయాలు రాబడతారు. మనం పూర్తిగా వారి మాయలో పడిపోయాం అని గ్రహించిన తరువాత మన నుండి బ్యాంకు సమాచారం లాగడానికి ప్రయత్నిస్తారు. వాళ్ళు కూర్చున్న చోటునుండే మన అకౌంట్లో ఉన్న మొత్తం దోచేస్తారు. లేదా మనమే వాళ్ళ ఖాతాకు డబ్బు పంపేలా మనల్ని నమ్మిస్తారు.

## వారూ వీరూ అన్న తేడా లేదు

### రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రఘురామిరెడ్డి అనుభవం!

"బెంగళూరులో నివసిస్తున్న రఘురామిరెడ్డి (పేరు మార్చాము) అనే ఒక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి ఇలాగే కాల్ వచ్చింది. తాము ముంబై సిబిఐ నుండి కాల్ చేస్తున్నామని నమ్మబలికారు. ఒక ఆర్థిక కుంభకోణంలో సదరు రఘురామిరెడ్డి ఖాతా నుండి లావాదేవీలు జరిగాయంటూ మాటలు కలిపారు. మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారని ప్రశ్నించారు. ఆయనని ఒక గదిలోకి వెళ్లి తలుపేసుకుని వీడియో కాల్‌లోకి రమ్మని పిలిచారు. అవతలివైపు వీడియో కాల్‌లో ఉన్న వ్యక్తి ఆఫీసు సెటప్పంతా ప్రభుత్వ కార్యాలయం లాగే ఉంది. అక్కడ జాతీయజెండా ఉంది. మూడు సింహాల చిత్రం. టేబుల్ పైన గ్లోబ్. సూటు వేసుకుని అచ్చం ఐపీఎస్ అధికారిలా అవతల వాడి బిల్డప్. ఇవన్నీ చూసిన రఘురామిరెడ్డి భయపడిపోయారు. తనకి తెలియకుండా ఎక్కడో తప్పు జరిగినట్లుందని భ్రమపడ్డాడు. రెండుగంటల పాటు తనని ప్రశ్నలతో సతాయించిన వ్యక్తి నిజంగానే సీబీఐ అనే నమ్మేశాడు. తన ఆధార్ వివరాలు అడిగితే ఇచ్చాడు, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పేశాడు. మళ్ళీ కాల్ చేస్తామని అంతవరకూ వివరాలన్నీ గోప్యంగా ఉంచాలని ఆదేశించి అవతల వ్యక్తి కాల్ కట్ చేశాడు. అయితే రఘురామిరెడ్డి ఊరకే ఉండలేదు. విదేశాలలో ఉంటున్న తన కుమారుడికి కాల్ చేసి జరిగిందంతా చెప్పాడు. ఐటీ రంగంలో పనిచేసే ఆయన కుమారుడికి ఇది ఫేక్ కాల్ అని అర్థమైపోయింది. వెంటనే బ్యాంకు ఖాతాని బ్లాక్ చేయించాడు. బెంగుళూరులోనే ఉంటున్న తన స్నేహితులని వెంటనే తమ నాన్న దగ్గరకి పంపించాడు, తన మిత్రులు వచ్చే వరకూ ఫోన్ ఆఫ్‌లో పెట్టమని తండ్రికి సలహా ఇచ్చాడు. తన కుమారుడి స్నేహితులు తన దగ్గరకి రాగానే రఘురామిరెడ్డి ఫోన్ ఆన్ చేశాడు... వాళ్ళు ఊహించినట్లే ఆ నకిలీ సిబిఐ గాడు మళ్ళీ ఫోన్ చేశాడు. ఆ కాల్ తన కొడుకు మిత్రుడు ఎత్తుకున్నాడు... ఇద్దరు కాసేపు అరుచుకున్నారు. హెచ్చరికలు చేసుకున్నారు. ఆ తరువాత అవతలివాడు తోకముడిచి కాల్ కట్ చేశాడు. ఇది 80 సంవత్సరాల వయస్సులో ఉన్న ఓ రిటైర్డ్ ఉద్యోగి అనుభవం."

### ఓ వైద్య విద్యార్థిని వ్యథ!

పాండిచ్చేరిలో పీజీ చేస్తున్న రచన (పేరు మార్చాము) అనే వైద్యవిద్యార్థినికి కూడా ఇదే తరహా కాల్ వచ్చింది. తాము ముంబై సీబీఐ నుండి మాట్లాడుతున్నామని నమ్మించారు. ఆమె పేరుతో వేరే దేశానికి ఒక కొరియర్ వెళ్లిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని ఆ దేశం నిఘావిభాగం కేసును తమకి బదిలీ చేసిందని మాటలు మొదలు పెట్టారు. ఆమె షాకయ్యింది. తనకేమీ సంబంధం లేదని, తాను ఎవ్వరికీ కొరియర్ పంపలేదని చెప్పింది. వెంటనే అవతల వ్యక్తి స్కైప్లో వీడియో కాల్‌కి రమ్మన్నాడు. మళ్ళీ బెంగళూరు తరహా సీన్ రిపీట్. నీ బ్యాంకు ఖాతా నుండే సదరు కొరియర్ కంపెనీకి డబ్బు వెళ్ళిందంటూ దబాయించారు. రచన బ్యాంకు ఖాతా వివరాలు అడిగారు. ఆధార్ నంబర్ తీసుకున్నారు. మళ్ళీ ఫోన్ చేస్తామని కట్ చేశారు. రచన తండ్రి ప్రభుత్వరంగంలో ఉన్నతస్థాయి అధికారి. ఆ అమ్మాయి వెంటనే తన నాన్నకి కాల్ చేసింది. ఆయనకి విషయం అర్థమైపోయింది. ఆమె బ్యాంకు ఖాతాలన్నీ ఖాళీ చేయించేశారు. ఆ తరువాత మూడు రోజులకి రచన తండ్రికే నేరుగా ఫోన్ వెళ్ళింది. మీ అమ్మాయి ఎక్కడ..? అంటూ రచన నాన్నని నకిలీ అధికారి దబాయించాడు. ఎవడ్రా నువ్వు... అంటూ రచన నాన్న ఉగ్రుడైపోవడంతో కాల్ కట్ చేసేశారు. ఇది ఓ వైద్య విద్యార్థిని వ్యథ.

### ఓ ప్రభుత్వ ఉద్యోగి కథ!

హైదరాబాదులో ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్న శ్రీరామ్‌రెడ్డి అనే ఉద్యోగికి ఇలాంటి కాలే వచ్చింది. మేము ఢిల్లీ సీబీఐ నుండి మాట్లాడుతున్నాము, మీ అమ్మాయి అర్చన (పేరు మార్చాము) అమెరికాలో చదువుతోందా..? అని ప్రశ్నించారు. అవును అని శ్రీరామ్‌రెడ్డి సమాధానం చెప్పాడు. అయితే, మీ అమ్మాయి అమెరికాలో డ్రగ్స్ కేసులో పట్టుబడింది. ప్రస్తుతం ఆమె ఎఫ్.బి.ఐ అధీనంలో ఉంది, వాళ్ళు కేసు వివరాలు మాకు పంపారు. మేం మీతో మాట్లాడాలి స్కైప్‌లో వీడియో కాల్‌కి రమ్మని పిలిచారు. కానీ శ్రీరామ్‌రెడ్డి అస్సలు తొణకలేదు.. ఎందుకంటే ఆ ఫోన్ వచ్చిన సమయంలో ఆయన కూతురు అర్చన హైదరాబాదులో తన ఇంట్లో తన ఎదురుగానే ఉంది. అది నకిలీ కాల్ అని ఆయనకి అర్థమైపోయింది. ఇది ఓ ప్రభుత్వ ఉద్యోగి కథ.

### బీజేపీ నేతకీ తప్పని తిప్పలు!

ఇక ఇటీవల మాజీ ఎం.ఏల్.సి వాకాటి నారాయణరెడ్డికి కూడా ఇలాంటి కాలే వచ్చింది. తాము ఈడీ నుండి మాట్లాడుతున్నామని నమ్మించారు. అపార రాజకీయ పలుకుబడి కలిగిన ఆ బీజేపీ నాయకుడిని సైతం రెండు రోజులపాటు తన హోటల్ గది నుండి బయటకి రానీయకుండా భయపెట్టారు. తనకి వచ్చింది నకిలీ ఫోన్ కాల్ అని తెలుసుకోవడానికి ఆయనకి రెండు రోజులు పట్టింది.

### కార్పొరేట్ రంగాన్నీ వదిలిపెట్టలేదు!

ప్రముఖ వస్త్ర వ్యాపార దిగ్గజం వర్ధమాన్ గ్రూప్ ఛైర్మెన్ ఎస్.పి.ఓస్వాల్‌పై కూడా సైబర్ ముఠా దాడి చేసింది. ఆయన గ్రూప్‌కి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సుప్రీం ఆయనకి వ్యతిరేకంగా తీర్పు చెప్పిందని, ఏకంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నాయకత్వంలోని న్యాయమూర్తుల బృందం ఈ తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఒక రహస్య ఖాతాలో ఓస్వాల్ 7 కోట్లు జమ చేయాలన్నది ఆ తీర్పు సారాంశం అని పేర్కొన్నారు. ఆ కేసుకి సంబంధించి విచారణ జరుగుతున్న సమయంలో రికార్డు అయినట్లుగా నకిలీ వీడియోని ఓస్వాల్‌కి పంపించారు. ఆ వీడియోలో సుప్రీం కోర్టు సెటప్ ఉంది. లాయర్లు ఉన్నారు. జడ్జీలు కూడా ఉన్నారు. అయితే వాళ్ళ ముఖాలు కనపడకుండా మార్ఫింగ్ చేశారు. వాదోపవాదాలు, సుత్తితో బల్లపై కొట్టటాలు, అద్భుతమైన ఆంగ్ల పదాలతో తీర్పు వంటివి నమ్మిన ఓస్వాల్ 7 కోట్లని జమ చేశారు. అయితే, ఎందుకో అనుమానం కలిగిన ఆయన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా... ఈ స్కాముని అతి కష్టం మీద పంజాబ్ పోలీసులు ఛేదించారు. ఓస్వాల్ డబ్బుని రికవరీ చేశారు.

హైదరాబాదు, చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలలో కార్పొరేట్ ఆసుపత్రులలో పనిచేస్తున్న డాక్టర్లకి కూడా ఇదే తరహా ఫోన్‌లు వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమ బిడ్డలని అమెరికాలో చదివించుకుంటున్న సామాన్య జనానికి కూడా ఈ సైబర్ కేటుగాళ్ళ బెడద తప్పడం లేదు.

సైబర్ నేరగాళ్ళు ఎన్నుకుంటున్న వ్యక్తులు, చూపిస్తున్న ఆధారాలు గమనిస్తుంటే కొన్ని లక్షల కుటుంబాలకి సంబంధించిన వ్యక్తిగత సమాచారం వాళ్ళ దగ్గర ఉన్నట్లు స్పష్టమైపోతోంది. ఇది ఒక అంతర్జాతీయ మాఫియా నడుపుతున్న వ్యవహారమని, ఈ విషయంలో ప్రభుత్వాలు ఏమీ చేయలేవని ఒక ఐటీ నిపుణుడు చెప్తున్నాడంటే ఈ ముఠా ఎంతటి ప్రమాదకరమైందో అర్థమైపోతుంది.

సుప్రీం కోర్టు, హైకోర్టు, సీబీఐ, ఈడీ, ఇన్‌కంటాక్స్ వంటి శాఖల అధికారులు ఎవ్వరికీ ఫోన్లు చెయ్యరన్న విషయం గ్రహించాలి. వాళ్ళకి ఎవరిపైనైనా అనుమానం ఉంటే నేరుగా వస్తారు తప్ప ఫోన్ చెయ్యరు. వీడియో కాల్ అస్సలు చెయ్యరు. అక్రమసంపాదనలో ఆరితేరిపోయిన సైబర్ నేరగాళ్ల వికృత చర్యలు రోజు రోజుకి మితిమీరుతున్నాయి. శరవేగంగా పెరుగుతున్న సాంకేతిన పరిజ్ఞానం కారణంగా వ్యక్తిగత సమాచార భద్రతకి ప్రమాదం ఏర్పడింది. ఈ విషయంలో ప్రభుత్వాలపై ఆధారపడకుండా ప్రజలే అప్రమత్తంగా ఉండాలి. తమ సమాచారాన్ని తామే జాగ్రత్తగా దాచుకోవాలి. లేదంటే ఈ సైబర్ నేరగాళ్ళు మన ఫోన్‌లలో కూడా చొరబడతారు.

తస్మాత్ జాగ్రత్త..!

# రామాయణం మహా కావ్యం

## కలెక్టరేట్‌లో ఘనంగా 'వాల్మీకి జయంతి'



భారతజాతి మొత్తాన్ని ఐక్యంగా ఉంచే మహా కావ్యం రామాయణమని, అలాంటి కావ్యాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తుండడం హర్షదాయకమని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఈనెల 17న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వాల్మీకి మహర్షి జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశంలోని ప్రతి గ్రామంలో రామాయణ ఇతిహాస గాథ విన్పిస్తూ ఉంటుందన్నారు. దేశమంతటిని ఒక్కటిగా నిలిపే శక్తి ఒక్క రామాయణ మహాకావ్యానికే ఉందన్నారు. తొలుత బీసీ నాయకులు వెంట రాగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలాలంకరణ చేశారు. డీఆర్ఓ లవన్న, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసులు, బీసీ నాయకులు బూదాటి రాధాకృష్ణయ్య, జనార్ధన్, నాగరాజారావు, వెంకటసుబ్బయ్య, హజరతయ్య, కోటేశ్వరరావు, మస్తానయ్య పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా..

# విజయదశమి వేడుకలు

జిల్లాలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవార్ల దేవాలయాలు ప్రత్యేకపూజలు, సేవలతో కళకళలాడాయి. దశరా సంబరాలతో గ్రామాల్లో కోలాహలం మిన్నంటింది. ప్రత్యేకించి నెల్లూరులోని అన్నిదేవాలయాల్లో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నెల్లూరు నగరంలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, మూలాపేటలోని శ్రీ భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరాలయం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారి దేవాలయం, మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానం, స్టోన్‌హౌస్ పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరం ఇలా అన్నిచోట్లా అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలతో ఆలయాలు కోలాహలంగా మారాయి. కొన్ని ఆలయాల్లో శమీపూజ, నవావరణ పూజలు, చండీయాగం వగైరాలన్నీ నేత్రపర్వంగా నిర్వహించారు. శరన్నవ రాత్రులను పురస్కరించుకుని ఆదిపరాశక్తి అయిన ఆ దుర్గాదేవి రూపాలకు ఒక్కోరోజు ఒక్కో విశేష అలంకారాలను నిర్వహించి పూజలు చేశారు. అమ్మవారి నామోచ్చరణలతో, నగరోత్సవాలతో నెల్లూరు నగరం మార్మోగింది. వేలసంఖ్యలో భక్తులు ఆలయాలకు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

# రతన్ టాటాకు..'వాత్సల్య' నివాళి



ప్రపంచప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజం, మహాదాత రతన్‌టాటా మరణానికి చింతిస్తూ నెల్లూరులోని జనహిత వాత్సల్య సంస్థకు చెందిన నిరాధార బాలల కేంద్రం ప్రాంగణంలో నిర్వాహకులు, బాలలు రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకుంటూ రతన్ టాటా పేరుతో మొక్కను నాటారు. ఈ సందర్భంగా వాత్సల్య సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు, ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకరరావు మాట్లాడుతూ, గుండుసూది నుంచి విమానాల తయారీ వరకు ఎన్నో బృహత్తరమైన సంస్థలను నెలకొల్పి లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధులను కల్పించిన మహనీయుడని రతన్ టాటాను కొనియాడారు. సేవాతత్పరుడైన రతన్ టాటా కోట్లాదిమందికి స్ఫూర్తిప్రదాత అని, ఆయన జీవితం మార్గదర్శకమని అన్నారు. వాత్సల్య చిన్నారులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరి అమ్మవారికి కిరీటం సమర్పణ



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి దాతలు కిరీటం సమర్పించారు. రాగిపై బంగారు పూత పూసిన ఆ కిరీటాన్ని నగరానికి చెందిన దాతలు రావులపల్లి వెంకట్రామానాయుడు, సులోచనమ్మ దంపతులు అమ్మవారి అలంకరణ కోసం ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆలయాల్లో.. మంత్రి నారాయణ దంపతుల పూజలు



విజయదశమిని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ నారాయణ, తన సతీమణి రమాదేవితో కలసి ఇటీవల నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి, యాదవవీధిలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవార్ల కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు, నిర్వాహకులు మంత్రి దంపతులను సంప్రదాయం ప్రకారం సాదరంగా స్వాగతించి పూజలు చేయించి ఆశీర్వదించారు.

### నిరుపేదలకు సాయం :



విజయదశమి పర్వదినం రోజున నారాయణ దంపతులు పలువురు నిరుపేద కుటుంబాల వారికి ఆర్థిక సాయం అందించారు. నడవలేని స్థితిలో ఉన్న మరికొందరికి చేయూతనిచ్చి, వారికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని పలువురు చిరు వ్యాపారులకు జీవనాధారంగా తోపుడు బండ్లను, వికలాంగుల ట్రైసైకిల్స్‌ను అందజేశారు.

### స్నేహితుడికి మంత్రి నారాయణ భరోసా :



మిత్రమా.. నేనున్నా.. అధైర్యపడకు, నీకు ఏం కావాలన్నా నేనున్నా'నంటూ మంత్రి నారాయణ, అనారోగ్యంతో బాధపడుతున్న తన క్లాస్‌మేట్ కొండూరు సుబ్బారెడ్డికి భరోసా ఇచ్చారు. నెల్లూరు 9వ డివిజన్‌కు చెందిన సుబ్బారెడ్డి, గత కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగాలేక అవస్తపడుతున్నాడన్న విషయం తెలియగానే మంత్రి ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించి, ఆయన ఆరోగ్య విషయాలను ఆరాతీశారు. భయపడాల్సిన అవసరంలేదని, ఏ సహాయం కావాలన్నా తానున్నానంటూ ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

# 'సర్వేపల్లి సిస్టర్స్'కు అరుదైన గౌరవం

## మైసూరు దత్తపీఠానికి..ఆస్థాన విదుషీమణులుగా స్థానం



చిన్నతనం నుంచి సంగీతంపై మక్కువతో నిరంతర సాధన చేసి, నేడు సంగీత రంగంలో తమదంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్న నెల్లూరులోని సర్వేపల్లి శ్రేయ-సర్వేపల్లి రాజలక్ష్మి (సర్వేపల్లి సిస్టర్స్)లకి అరుదైన గౌరవం లభించింది. కర్నాటక శాస్త్రీయ సంగీతంలో ఈ అక్కాచెల్లెళ్ల గానమాధుర్యాన్ని మెచ్చుకుంటూ, ఇటీవల మైసూరులోని దత్తపీఠం పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారిని అభినందించి దత్తపీఠం 'ఆస్థాన విదుషీ'లుగా బిరుదు ప్రదానం చేశారు. విజయదశమి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లో దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి సిస్టర్స్ పాల్గొని వారి మధురగానంతో ప్రేక్షకులను భక్తిభావసమన్వితులను చేశారు. దీంతో శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వారిని ఆశీర్వదించి బిరుదునిచ్చి గౌరవించారు. వైద్యవిద్యలో కూడా వారిద్దరూ ప్రతిభతో రాణించడం సంతోషకరమని స్వామీజీ అభినందించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవవర్మ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీతో పాటు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థస్వామీజీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సోదరీమణులిద్దరూ స్థానిక పొగతోటలోని ప్రముఖ వైద్యులు డా.సర్వేపల్లి అజయ్‌కుమార్ కుమార్తెలు కావడం విశేషం. చిన్నవయసు నుంచే వీరు అనేక సంగీత కార్యక్రమాల్లో, పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు, అవార్డులు పొందివుండడం అందరికీ తెలిసిందే. నగరంలోని పలు సంగీతకారులు, సంగీతాభిమానులు సర్వేపల్లి సిస్టర్స్‌కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## టూకీగా...



### విడవలూరు అంకమ్మతల్లికి విశేష పూజలు

విజయదశమి వేడుకల్లో భాగంగా విడవలూరులో అంకమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నేత్రపర్వంగా పల్లకిసేవ నిర్వహించారు. పూండ్ల హరినాథ్‌రెడ్డి, హరితమ్మ, అచ్యుత్‌రెడ్డి, మాధవి, పొన్నలూరు మురళీమోహన్‌రెడ్డి, మహిత, కాటంరెడ్డి సుబ్బారెడ్డి, కమలమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### సోమశిల డ్యామ్‌ను పరిశీలించిన అధికారులు

జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈనెల 15న నీటిపారుదల ఎస్ఇ వెంకటరమణారెడ్డి, డీఇ రవీంద్రప్రసాద్, ఏఇఇ దశరథరామిరెడ్డి, జీఇఇలు సోమశిల డ్యామ్‌ను సందర్శించి, జలాశయం గేట్లను కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తుండాలని వారికి సూచించారు.

### ముంగలదొరువులో రైతులకు అవగాహన

తోటపల్లిగూడూరు మండలంలోని ముంగలదొరువు గ్రామంలో ఈనెల 15న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ రైతులతో సమావేశం జరిపారు. భూసారం పెంపొందించుకోవడంపై అవగాహన కలిగించారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడవద్దన్నారు. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, జీవన ఎరువులతో నేలను సారవంతం చేసుకోవాలని చెప్పారు.

### విడవలూరు వాసి..నేత్రదానం

విడవలూరు జాన్‌పేటకు చెందిన ఎల్లు వెంకయ్య (52) ఈనె 15న ఆకస్మికంగా మృతిచెందగా, 'మన' సేవాసంస్థ ఆధ్వర్యంలో, కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. నెల్లూరులోని మోడరన్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ మృతుడి నేత్రాలను సేకరించారు.

### ఎర్రగుంట వద్ద రోడ్డుప్రమాదం.. జింక మృతి

వెంకటాచలం మండలంలోని ఎర్రగుంట వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఈనెల 15న ఒక జింక మృతిచెందింది. అది గమనించిన స్థానికులు అటవీ అధికారులకు తెలపడంతో, వారు వచ్చి ప్రమాదంపై ఆరాతీశారు. జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.

### కోవూరు జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు

కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జడ్పీహైస్కూల్‌లో ఇటీవల స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని చెప్పారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు ఎంవి చరణ్, డి.విజయ కుమార్, ఫీల్డాఫీసర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వెంకటాచలం మండలంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

వెంకటాచలం మండలంలోని కసుమూరు పంచాయతీలోని తిప్ప వద్ద, పూడిపర్తి గ్రామంలోను పేకాట స్థావరాలపై పోలీసులు ఇటీవల దాడులు చేసి పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. పూడిపర్తి వద్ద 8 మందిని పట్టుకుని వారివద్దనుంచి 1120 రూపాయలను, కసుమూరు తిప్పవద్ద నలుగురిని పట్టుకుని రూ.12,740 స్వాధీనం చేసుకుని కేసులు నమోదుచేశారు.

### చేజర్లలో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మండల కేంద్రమైన చేజర్లలో ఇటీవల ఉలవపల్లి వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను చేజర్ల ఎస్ఐ ప్రభాకర్, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, వాటి యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని సీఐ వేమారెడ్డి తెలిపారు.

### నారికేళ్ళపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ముత్తుకూరు మండలం నారికేళ్ళపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారి శివన్నారాయణ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి రైతులు లాభసాటి సేద్యం చేసుకునేవిధంగా అవగాహన కలిగించారు. వారికి సబ్సిడీపై విత్తనాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.

○ అక్టోబరు 21, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

# ఓ పోలీసన్నా!.. నీకు సాటెవరూ లేరన్నా!



**పోలీస్..అంటే క్రమశిక్షణ, పోలీస్ అంటే నిబద్ధత, పోలీస్ అంటే ధైర్యం.. పోలీస్ అంటే సాహసం, పోలీస్ అంటే త్యాగం. పోలీస్ అంటేనే సమాజానికి భరోసా. పోలీస్ ఉంటేనే ప్రజలకు కులాసా. పోలీస్ లేని సమాజాన్ని ఊహించలేం. పోలీసే లేకుంటే అన్యాయాలే వీరంగం చేస్తాయి..దౌర్జన్యాలే రాజ్యమేలుతాయి. అలాంటి అరాచకశక్తుల నుంచి ప్రజలను, సమాజాన్ని కాపాడేది పోలీసే. మనమంతా గుర్రుపెట్టి నిద్రపోతున్నా, కంటికి కునుకు లేకుండా భద్రత కల్పిస్తూ కాపలా కాసేదీ పోలీసే. ఎవరికి ఏ ఆపద వచ్చినా 'నేనున్నా' నంటూ పరుగెత్తుకు వచ్చేది పోలీసే. అందుకే పోలీస్ అంటే ప్రజలకు గౌరవం!..**

## శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా...

పోలీస్ అంటే ప్రజలకు మిత్రుడు. అసాంఘికశక్తులకు శత్రువు. అందుకే, నేరగాళ్లకు పోలీసంటే భయం! రౌడీలు–హంతకులు, దొంగలు–దోపిడీగాళ్ళకు పోలీసంటే వెన్నులో వణుకు. రౌడీయిజాలను, అరాచకాలను ఎక్కడికక్కడ అరికడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే గొడవలు, ఘర్షణలపై లాఠీ ఝుళిపించి అదుపుచేసే శక్తివంతమైన వ్యక్తి..పోలీసే. ఎంతటి కష్టాన్నయినా భరించి సమాజ క్షేమం కోసం ఎల్లవేళలా పోరాడేది పోలీసే. అతేకాదు, ఎండ లేదు, వాన లేదు..తుఫానొచ్చినా సరే, వరదలు ముంచుతున్నా సరే..డ్యూటీ అంటే డ్యూటీయే. ఎంతటి ఆపదల్లోనైనా, ఎంతటి ఉపద్రవాల్లోనైనా మీకోసం మేమున్నామంటూ ముందుకు వచ్చి ఆపన్నహస్తం అందించేది వారే. వరదల్లో బాధితులను రక్షించేదీ వారే, తుఫానుల్లో కాపాడేదీ వారే. క్రమశిక్షణతో డ్యూటీ చేయడమన్నది పోలీస్ నైజం. కరోనా కాలంలో పోలీస్ సేవలు అందరికీ గుర్తుండే ఉంటాయి. విధులు నిర్వహిస్తూ కరోనా బారినపడి మరణించిన వారూ ఉన్నారు. వారి త్యాగాలను మరువగలమా?.. రేయింబవళ్ళు వారు చేసిన సేవలను విస్మరించగలమా?..

## ప్రాణాలని సైతం లెక్కచేయకుండా...

విధి నిర్వహణలో ధైర్యంగా పోరాడుతూ, ప్రాణాలను సైతం లెక్కచేయని ధీరులు.. మన పోలీసులు. ఎందరో పోలీసులు నేటికీ నిరంతరం అసాంఘికశక్తులను ఎదుర్కొంటూనే ఉన్నారు. అలాంటి వీరోచిత పోరాటాల్లో దురదృష్టవశాత్తూ ఎందరో పోలీసులు తీవ్రవాదులు, ఉగ్రవాదులు, తదితర ముష్కరుల చేతుల్లో మరణిస్తున్నారు. వారి ప్రాణ త్యాగాలు, సమాజానికి చేసిన అసమాన సేవలు ఏనాటికీ విస్మరించలేనివి. మన కోసం జీవిస్తూ..సమాజ క్షేమం కోసం ప్రాణాలొడ్డి పోరాడిన మన అమర పోలీసువీరులను గుర్తుంచుకుంటూ, వారి సేవలను సంస్మరించుకోవడం.. మనందరి కర్తవ్యం!..

**అమర పోలీసువీరులను సంస్మరించుకుందాం!.. మనల్ని మనమే గౌరవించుకుందాం!..**









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com